ఆదివారం

ప్రజాశక్తి

జూన్ 15, 2003

మహిళా మేలుకో...

హ్యాపీ బర్త్‌డే

(15-6-2003 నుండి 21-6-2003 వరకు)



కావ్యశ్రీ
జూన్
మాధురి-సుదర్శన్
తనకంపాడు-ఖమ్మం

బి.వనిశ్రీ
జూన్-15
మంజుల- మహేందర్‌గౌడ్
నాగర్‌గూడ-రంగారెడ్డి

జి.ని తిన్ (సాల్మన్‌రాజ్)
1॥సం,16. 6. 2002
రాజాలక్ష్మి-రవికుమార్
అడ్డగుట్ట-సికింద్రాబాద్

అనిల్‌కుమార్
జూన్-16
ఏలిశమ్మ-వీరయ్య
స్వర్ణభారతినగర్-గుంటూరు

జి.హర్షవర్ధన్
4సం॥, 16-6-1999
వసుంధర-ఆంజనేయులు
కదిరి-అనంతపురం

ప్రణిత్‌రాజ్.పి
4॥సం,16. 6. 1999
రోజారాజ్-అశోక్‌రాజ్
రామచంద్రాపురం-మెదక్

కె. చంద్రవంశీ
2॥సం,17. 6. 2001
రాజ్యలక్ష్మి-వీరయ్య
గోల్కొండ క్రాస్ రోడ్-హైదరాబాద్

హేమంత్ కుమార్
4॥సం,18. 6. 1999
శశికళ-కృష్ణమూర్తి
గున్‌గల్-రంగారెడ్డి



జె.ప్రభాత్(పండు)
5॥సం,జూన్-1998
రాధ-గోపాలన్
భీమవరం-ప॥గో॥

మనలో మాట

ఇవిగో వరాలు..

అన్నార్తులను ఆదుకోవడం ఉత్తమ లక్షణం!

మహాపురుషులకు మాత్రమే ఈ లక్షణం ఆస్తిగా ఉంటుంది!

ఓర్చుకోండోర్చుకోండని ఊరడించడం ఉత్తుత్తి లక్షణం!

బతక నేర్చిన వాడికి ఈ లక్షణం గొప్ప అలంకారంగా ఉంటుంది!

ఆకలిగా ఉంటే మా ఇంటి తలుపు తట్టండని మహాపురుషులు ప్రకటనలు చేయక పోవచ్చు. అన్నార్తులు వాళ్ళ కంటబడితే ఓర్చుకోలేరు!

చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష అనుకునే జాతి మనుషులు కాదు గనక - అవతలి మనిషి ఆకల్తో ఉన్నప్పుడు - వాళ్ళకు అన్నం సయించదు! ఉన్నది వాళ్లకు పెట్టి - నీళ్ళు తాగి తమ కడుపు నింపుకుని తృప్తి పడతారు!

తమ దగ్గిరున్న చివరి రూపాయితో సిగరెట్టు కొనుక్కోవాలని అనుకోరు! ఆకలి మనిషి కోసం ఆ రూపాయి దాచిపెడతారు!

బతకనేర్చిన వాళ్ళతోనే అల్లరెక్కువ!

నిన్ను ఆదుకుంటే నాకేంటి అనే లెక్కమీద వాళ్ళకు మోజెక్కువ!

వాళ్ళేం చేసినా లెక్క ప్రకారం చేస్తారు. మూడుకు ఒకటి కలిపితే నాలుగవుతుందనీ - మూడు నుంచి రెండు లేపేస్తే ఒకటవుతుందనే దిక్కుమాలిన లెక్కల్లో వాళ్ళు బిజీగా ఉంటారు!

ఆ లెక్కలు పేపరు మీద చేసుకుంటే - లెక్కల పిచ్చి అని సరిపెట్టుకుంటాం. పచ్చి జీవితాలను సైతం లెక్కల్లో ముడివేసి ముచ్చట పడుతుంటారు!

కష్టాలకు తట్టుకోలేని బడుగు జీవులు తిరగబడాలనుకున్నప్పుడు - వాళ్ళను లెక్కల్లోనే బుజ్జగిస్తారు!

ఓర్చుకోండోర్చుకోండని ఊరడింపు గుణింతాలతో లెక్కలు కట్టి కోటి వరాల లెక్కను మన ముందుంచుతారు!

ఇళ్ళు ఫ్రీ. ఇంటో దీపాలు ఫ్రీ. చదువు ఫ్రీ. స్కూలుకు వెళ్ళేందుకు సైకిళ్ళు ఫ్రీ. ఓర్చుకోండోర్చుకోండి - ఫ్రీ సీజను ముందరుందని ఊరడిస్తారు!

అవతల పార్టీ పెద్ద మనిషికి పలుకుబడి బలిసిపోతుందని వేగుల వాళ్ళు చెప్పినప్పుడు తట్టుకోలేరు! అతనివి తప్పుడు లెక్కలని నింద వేస్తారు. మావి కరెక్టు లెక్కలని కాకుల్ని పిలుస్తారు!

అంత మాత్రాన -

అవతలి పార్టీ పెద్ద మనిషి మన దీన హీన బతుకుల్లో వెన్నెల కురిపిస్తాడనే గ్యారంటీ లేదు. అతను సైతం ఊరడింపు లెక్కల్లో పలుకుబడి పెంచుకునే కార్యక్రమంలో బిజీగా ఉంటాడు!

అంచేత -

వాళ్ళూ వీళ్ళూ ఉత్తుత్తి వరాలివ్వడంలో పోటీ పడుతున్నారని మనం గమనించగలిగితే - బతక నేర్చిన ఏలికలకు - మనం కూడా ఉత్తుత్తి వరాలు శతకోటి సంఖ్యలో ఇచ్చి సత్కరించవచ్చు! తర్వాత మీ ఇష్టం! ◆

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్‌స్టోరీ . . . 3
ఆరోగ్యం . . . 6
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
టూరిస్టుగైడ్ . . . 16
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
కళాసాహితి . . . 21
పలుకుబడి 24
వగైరా . . . .

ఇంకా...

ఆది నుండి ఆటపాటలతో అక్షరాభ్యాసం బాలవికాసం ...10

తల్లీ! వందనం!
'ఇంతి' సంగతులు . . . 15

జీవకారుణ్యారణ్యం
కథ . . . 18, 19

ఎదురీదిన వైకల్యం
రియల్‌స్టోరీ . . .22, 23


మెచ్చుకోదగిన మనిషి. ఆయన ఎన్నడూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదు. పార్టీ అంతా అలా చేసి ఆయనను ఒంటరిగా వదిలేసింది.
ఇందులో రెండు ఖండనలున్నాయి. నేనేవైనా తప్పుడు ప్రకటనలు చేసినప్పుడు వీటిని విడుదల చేయండి.
అంతర్జాతీయ ఉక్కు మనిషి
ఒత్తిడా! ఏమి ఒత్తిడి ?!
Surendra
ఆయన చాలా బిజీ... ఖాళీ సమయం దొరికినప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడకు వస్తారు!
వాస్తవానికి నేను ఎన్నికల్లో ఓడిపోతే ఉపయోగపడేందుకే
Keshav

* కె.ఉష

మహిళా మేలుకో...

"ఆడకూతురా నీకు అడుగడుగున వందనం
అనునిత్యం పడిలేచే నీవు రక్త చందనం"
అన్నారో సినీ కవి.

"ఇదేనా మన సంప్రదాయమిదేనా
వరకట్నపు దురాచార దురంతాల
కోరలలో... అన్నెం పున్నెం ఎరుగని ఆడపడుచు
బలియేనా....?"
అని ప్రశ్నించారు మరో కవి.

నిజమే... ఎన్నో తీయని తలపులతో అత్తవారింటి తలుపు తట్టిన యువతికి ఆ ఇంటి నుండి ఆరళ్లు, కట్నం కోసం వేధింపులు మొదలైతే... ఓపికున్నంత వరకు అల్లుడిగారి గొంతెమ్మ కోర్కెలను తీర్చే అత్తమామలు కొందరు. ఆ పరిస్థితి లేనపుడు కాళ్ళావేళ్ళా పడి జానెడు చోటు చాలంటూ బతిమలాడి ఆపై ''ప్రమాదవశాత్తు'' మృతి చెందే అమ్మాయిలు మరికొందరు. అంతో ఇంతో ధైర్యంతో పోలీసులను ఆశ్రయించి విఫలమై నిలువునా ప్రాణం తీసుకునే వారు మరికొందరు. అటు అత్తగారికి సమాధానం చెప్పలేక, ఇటు కన్న వారి కష్టాలను కంటితో చూడలేక రైలు పట్టాలపై ముక్కలుగా మిగిలేవారు ఇంకొందరు.... ఇలా ఎన్నో దారులు... నడుస్తున్న కాలానికి గుర్తులు. కాలం మారిపోయిందని కాలంతో తామూ మారాలని కట్నాన్ని తప్పనిసరి లాంఛనంగా నరనరాన ఎక్కించుకున్న ప్రస్తుత దశలో ముగ్గురమ్మాయిలు ఈ చర్చకు మళ్ళీ ప్రాణం పోశారు. వరకట్నంపై తిరుగుబాటు చేసి కట్న పిశాచులను జైలుకు పంపిన ఉదంతాలు ఇవి. కట్నం విషయాన్ని మరోసారి చర్చకు పెట్టిన యువతి ఢిల్లీకి చెందిన నిషాశర్మ. పెళ్ళికి వచ్చిన రెండు వేలమంది అతిధులూ, తల్లిదండ్రులూ వరుడి కోర్కెలకు తలలూపినా, నిషాకి సర్దిచెప్పినా ఆమె ధైర్యంగా పెళ్ళి మండపాన్ని కాదని దాటింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన నిషా తనకు అర్హతలలో ఏ మాత్రం సరిపోని, అబద్ధాలను చెప్పే వరుడి డిమాండ్లను ఖాతరు చేయకపోవడంతో ఇది మీడియా దృష్టిని బాగా ఆకర్షించింది. చెన్నయ్ మాంబళానికి చెందిన విద్యకు ఈ నెల 4వ తేదీన పెళ్ళి ముహూర్తాన్ని నిర్ణయించారు. పెళ్ళి సమయంలో వరుడికి పలు రకాల వస్తువులు గుర్తొచ్చాయి. అదనపు కట్నం కోరాలన్న

[illegible] వచ్చింది. గొంతెమ్మ కోర్కెల లిస్టు పెట్టాడు. దీంతో పెళ్ళి పీటలపై నుండి బయటకు వచ్చిన విద్య వరుడి కోర్కెలపై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచిత్రంగా ఈ కేసులో విద్యకు తల్లిదండ్రులు, బంధువుల మద్దతు తెలిపితే పోలీసులు రాజీకి కూడా ప్రయత్నించారు. ఇలాంటిదే మన దేశ రాజధానిలోనూ జరిగింది. వరకట్నం కింద మారుతీకారును డిమాండ్ చేసిన వ్యక్తితో తనకు వివాహం అక్కర్లేదని న్యూఢిల్లీకి చెందిన ప్రేమలత అనే యువతి తెగేసి చెప్పింది. తండ్రి అండతో కట్న పిశాచులను కటకటాల వెనక్కు పంపించింది. ఈ ఘటనలు మీడియాలోనూ, ఇతరత్రా వరకట్నంపై చర్చకు మళ్ళీ తెరతీశాయి.

ఈ మూడు ఘటనల తర్వాత అనేక రకాల చర్చలు మొదలయ్యాయి. పెళ్ళి సమయంలో ఆమోదయోగ్యమైన డిమాండ్లను తీర్చడంలో తప్పులేదని కొందరంటున్నారు. ఆడపిల్ల అర్హతలకు ఆ పిల్ల తెచ్చిన వస్తువులున్న అలమార్లు, టీవీలు, వాషింగ్‌మెషిన్లు, ఫ్రిజ్‌లు కొలమానాలా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. బేసి సంఖ్యలో చీరలు, లంగాలు తేవాలని కూడా చేసే డిమాండ్ ఆమోదయోగ్యమా అనేది వీరి వాదన. వరకట్నంపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సర్వే నిర్వహించినపుడు 'మాకు అత్తవారింట్లో తగిన గౌరవం దక్కడం అనేది మా తల్లిదండ్రులిచ్చే కట్నంపై ఆధారపడి ఉంటుందని" అమ్మాయిలు చెప్పారు. "మాకెటూ మా తల్లిదండ్రుల ఆస్తిలో వాటారాదు. ఈ పెళ్ళి సమయంలో వారిచ్చేదే మాకు దక్కేది. ఆ తర్వాత వారెటూ పట్టించుకోరు" అని మరికొందరు చెప్పారు. అంటే కట్నం అనే అంశం ఇచ్చే వారిలోనూ, పుచ్చుకునే వారిలోనూ తప్పని సరైనదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైగా కొందరు ఇది సహజాతిసహజమైన అంశంగా పరిగణి స్తున్నారు. దీంతో ప్రస్తుతం పెళ్లిళ్ళు సమస్థాయి ఆర్థిక వెసులుబాట్లు కలిగిన కుటుంబాలలోనే జరుగడాన్ని చూస్తున్నాం తాహతుకు సరిపడిన సంబంధాలుగా వీటికి పేరు పెట్టారు. పెళ్ళి ద్వారా ఆర్థిక స్థోమతను పెంచుకోవాలని చూసే సెక్షనూ మరోటుంది. ఇది వీళ్ళ దృష్టిలో ఫక్తు వ్యాపారం. మాట్లాడుకునే లావాదేవీలు కూడా ఇలాగే వుంటాయి. పెళ్ళికి ఎంత, అబ్బాయి అర్హతలకు ఎంత, అత్త ఆడబిడ్డల లాంఛనాలకు ఎంత, తొలిబిడ్డ పుడితే ఎంత, మలిబిడ్డనాటికి ముట్టజెప్పేది ఎంత, తల్లిదండ్రులు బతికుండగా ఎంత, చనిపోయాక ఎంత? ఇత్యాది వివరాలన్నింటినీ సాంప్రదాయం పేరిట ముందే మాట్లాడుకొంటుంటారు. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. అమ్మాయికి, అబ్బాయికి సమస్థాయి అర్హతలున్నప్పటికీ అబ్బాయి చదువుకు మాత్రమే విలువ నివ్వడం, దానికే ఖరీదు కట్టడం జరుగుతుంది. ఆ స్థాయి డిగ్రీలున్న అమ్మాయి తన చదువును ఉద్యోగంగా మలచుకోవాలో, వద్దో నిర్ణయించే అధికారం అత్తగారి కుటుంబానికి దఖలు పరచ బడుతుంది. వరుడి ఆర్థిక అవసరాల నేపథ్యంలోనే ఈ మహిళ తన భవిష్యత్‌ను మలచుకోవలసి ఉంటుంది. అవసరమని భర్త శాసిస్తే ఉద్యోగినిగా, అక్కర్లేదంటే గృహిణిగా ఆమె తన అభిప్రాయాలను మార్చుకోవలసి ఉంటుంది. కానీ పెళ్ళి సమయంలో మాత్రం తన అర్హతలను ఏ మాత్రం గుర్తుంచుకోకుండా వరుడి అర్హతలకు ఖరీదు కట్టి చెల్లించాల్సి వుంటుంది. ఇది సమాజంలో వేళ్ళూనుకున్న పురుషాధిక్య భావజాలానికి నిదర్శనం. వరకట్నమూ ఈ భావజాలంలోనిదే. పత్రికలలో మనస్తత్వ నిపుణులకు అమ్మాయిలు రాసే ఉత్తరాలలోనూ వారి సంఘర్షణను మనం చూడవచ్చు.

చట్టాలు మాత్రం వరకట్నాన్ని అరవీర భయంకరంగా తెగనాడుతున్నాయి. వరకట్న నిషేధ చట్టం 1961 ప్రకారం కట్నం అడగడం,

ఇదెక్కడి న్యాయం?

వివాహంలో కట్న కానుకల ప్రసక్తి డిమాండ్‌గా ముందుకొచ్చిన తర్వాత రెండు అంశాలు గురించి చెప్పుకోవాలి. అమ్మకం, కొనుగోలు జరుగుతున్నాయని అంగీకరించాలి. సాంప్రదాయమని చెప్పి తప్పించుకోవడం అలవాటే అయినా వాస్తవం మాత్రం అబ్బాయిని అమ్మాయి కొనుగోలు చేస్తుంది. అమ్మాయి పోషణ, బరువు బాధ్యతలను అబ్బాయి భరించాలి కాబట్టి కొంత మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారని కాసేపు సరిపెట్టుకుందాం. అబ్బాయి కంటే అదనంగా బాధ్యతలను పంచుకునే అర్హతలు, ఆర్థిక సంపాదన వున్న అమ్మాయిని కట్నం కావాలని డిమాండ్ చేయడమేమిటి? ఇక్కడ ఆ సూత్రం పనికిరాదన్నమాట. అమ్మాయి అయినందుకు కట్నం ఇవ్వాలి. అదీ రూలు, సాంప్రదాయం.

నేడు వరకట్నం - నాడు కన్యాశుల్కం

ఒకప్పుడు కన్యాశుల్కం, నేడు వరకట్నం పేర్లు ఏవైనా మహిళల బతుకులను కాలరాసిన ఉరితాళ్ళే. కన్యాశుల్కం విషయం పరిశీలిద్దాం. 19వ శతాబ్ది అంతం నాటికి మద్రాసు రాష్ట్రంలో నాలుగేండ్లలోపు పెండ్లయిన వాళ్ళు 24,257 మంది. 5-10 సంవత్సరాలకు వివాహం అయిన వారు 1,44,482 మంది వుండగా 72,102 మంది ఉత్తర సర్కార్లలో వుండేవారు. ఆడపిల్లలకు ఇచ్చే డబ్బుకోసం ఆనాడు 10 నెలల పిల్లలకు కూడా ఈ వివాహాలు జరిపించేవారు. తమ తద్దినాలు పెట్టడానికి, తమ ఆస్తికి వారసులను ఆశించి ముసలివాళ్లు ఆడపిల్లలకు డబ్బిచ్చి కొనుక్కునేవారు. ఫలితంగా ఆనాడు 80 శాతం దాకా వితంతువులుగా బతకాల్సిన దయనీయ స్థితికి ఆడపిల్లలు నెట్టబడ్డారు. మన రాష్ట్రంలో కన్యాశుల్కం అనంతర పరిస్థితులకు గురజాడ వారి కన్యాశుల్కం రచన నిలువెత్తు దర్పణం. కన్యాశుల్కం ఒకరకంగా మధ్యయుగాల నాటి అవశేషం. ప్రస్తుతం మనం రాకెట్ వేగంతో హైటెక్ లోకంలో విహరిస్తున్న వారం. అయినా వరకట్న హత్యలు దాదాపు 7 వేలకు పెరిగాయి. ఇవి కేవలం పోలీసు వారి లిస్టులోనివి. వరకట్నాన్ని కోరేవారు పెట్టే హింసలకు సంబంధించి లక్ష కేసులు నమోదై వున్నాయి. ఆనాడూ, ఈనాడూ మహిళలే బలిపశువులు.

ఇవ్వడం, పుచ్చుకోవడం నేరం. అనంతరం 1984, 1985, 1986 సవరణలు జరిగాయి. పెళ్ళయిన ఏడేళ్ళలోపు కాలిన గాయాలతో, ఇతర దెబ్బలతో, హింస జరిగిన గుర్తులతో ఏ మహిళైనా మృతి చెందినట్లు రుజువైతే దానిని వరకట్నం కేసుగా పరిగణించి ఏడేళ్ళు శిక్ష వేయాలని చట్టం చెబుతోంది. ఇందుకు చట్టంలో సెక్షన్ 498-ఎ, 304-బిల ను ఏర్పాటు చేశారు. అయితే ఈ చట్టాలు కలిగినోళ్ళ చుట్టాలుగా మారిన ఉదంతాలే ఎక్కువ. నేటి సమాజంలో నెలకొన్న టేకిట్ ఈజీపాలసీ కొంత. పోరాడలేక రాజీపడే మనస్తత్వాలు కొంత, అన్నింటికీ మించి కర్మ సిద్ధాంతం మరికొంత ఈ కేసులను నీరు గారుస్తున్నాయి. పెరిగిన వినియోగ సంస్కృతి పైత్యంతో కూతుర్ని పొట్టన పెట్టుకున్న అల్లుడికి మరో కూతురుని కట్టబెడుతున్న ఉదంతాలు కోకొల్లలు. టీవీలలోనూ, ఇతరత్రా రెచ్చగొట్టే ప్రకటనలలోనూ చూపించే అందమైన వస్తువులపై వ్యామోహం తీర్చుకోవడానికి పెళ్ళి, అనంతరం వచ్చే భార్య అలుసుగా దొరుకుతున్నారు. ఇలా అడగటాన్ని స్టేటస్ సింబల్‌గా మార్చి హైటెక్‌లో అడుక్కుంటున్న మొత్తమే ఈ వరకట్నం. ఈ తరహా భావజాలం ప్రస్తుత సమాజంలో సహజం. మరి స్త్రీ పురుషులు సమానమేనన్న ధోరణిని నిలదొక్కుకున్న నాడు ఆ సమాజంలో మాత్రమే ఈ అమ్మకాలు కొనుగోళ్ళు అగుతాయి.

మన రాష్ట్రంలో ప్ర'గతి'

(వరకట్నం విషయంలో)

సం॥	మరణాలు	హత్యలు	ప్రేరేపిత హత్యలు	వేధింపులు
2000	450	84	1007	5103
2001	406	96	948	5765
2002 (నవంబర్ నాటికి)	395	91	779	6448

ఇవి వెలుగులోకి వచ్చినవి. వెలికిరానివి కొన్ని రెట్లు అదనంగా వుంటాయి.

చివరగా ఒకమాట

మార్కెట్ శక్తుల వినియోగతత్వం పెరిగి అది వరకట్నం డిమాండుల్లో ప్రతిఫలిస్తోంది. ఈ డిమాండులు నెరవేరాలంటే మహిళల పోషణ అనే ముసుగులో కట్నం అవసరంగా మారింది. అడిగే వారిది ఆశ ఇచ్చే వారిది ప్రయాస. అంటే ఆశల భారం ఒక కుటుంబం నుండి మరో కుటుంబానికి మార్చబడి నష్టపరిహారంగా వరకట్న రూపంలో చెల్లించబడుతోంది. ఈ వరకట్నాల హింస గ్రామీణ ప్రాంతాలలో కొంచెం తక్కువే. అయితే సమస్య ఎక్కువగా మధ్యతరగతికే పరిమితమున్నట్టు మాట్లాడుతుంటారు. ఒక లెవల్ వారికి ఇలాంటి విషయాలు స్వల్పమన్నట్టు, ఏమీలేని వారికి ఇది సమస్యే కాదన్నట్టు వాదిస్తుంటారు. అంటే ఇలాంటి భావనల వల్ల వరకట్నం, అది నిర్వర్తించే ఆర్థిక కార్యకలాపాలు, డిమాండు, హింస తదితరాలను గుర్తించడంలో అవరోధం కలుగుతుంది. తక్కువ కొనుగోలు శక్తి కలిగిన మనలాంటి దేశాలలో మార్కెట్ డిమాండ్‌ను వరకట్నం సంతృప్తి పరుస్తోంది. వివాహ సమయాలలో ఇవ్వాల్సిన కానుకల లిస్టుల ప్రకటనలు ఇందుకే వస్తుంటాయి. వరకట్నం డబ్బు రూపంలో ఎక్కువగా డిమాండ్ చేస్తారు. దీనిని వరుని కుటుంబం ఆదాయ వనరుగా మార్చుకునే వ్యాపార పెట్టుబడిగా ఉపయోగిస్తారు. వివాహ ఏజెన్సీలు, కంపెనీలు వచ్చి కట్నాన్ని స్థిరపరిచి వ్యాపారంగా మార్చాయి. చేసుకునే వారిలోను వ్యాపార దృక్పథమే కనపడుతోంది. కాబట్టి వరకట్నం ఒక ప్రాథమిక పెట్టుబడి వనరు సమీకరణగా మారింది. అందుకే కట్నం ప్రసక్తి లేని ఆదివాసీ తెగలలోనూ ఈ దురాచారం కనపడుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ విధానాల వలన సంఘటితరంగం కుదించుకుపోతోంది. ఉద్యోగాలు లేవని ప్రభుత్వాలు ఘంటాపథంగా సెలవిస్తున్నాయి. స్వయం ఉపాధికి బ్యాంకులు సహకరించడం తగ్గింది. ఎలాగోలా బతకాలంటే ఈ వరకట్నం అతి దగ్గర దారై కూర్చొంది. ఇందుకు అర్హతలున్నా లేకున్నా అబ్బాయనే క్వాలిఫికేషన్ సరిపోతోంది. పెళ్ళి కాకపోవడం అనేది ఆ యువతి కర్మకు నిదర్శనంగా ప్రచారం జరుగుతుండటంతో ఎన్నింటికో రాజీ పడి మరీ పెళ్ళి చేసుకోవాల్సిన పరిస్థితులే నేడు ఎక్కువగా వున్నాయి. స్త్రీ, పురుష నిష్పత్తి ప్రకారం అమ్మాయిలకే డిమాండ్ పెరగాలి. అయితే ఈ డిమాండ్‌లోనూ ఆర్థికానిదే పెద్దపీటని చెప్పాలి. కట్నం అనే పేరు స్థానంలో లాంఛనాలు, తమ వారికి తాము ఇచ్చుకోవడం అనే పదాల మాటున వంచించుకోవడం జరుగుతోంది. పెట్టుపోతల పేరిట అత్తగారింటి వారు అడిగే జాబితాను సమకూర్చలేకపోవడం "దౌర్భాగ్యపు ఆడపిల్ల తండ్రి"కి మామూలేనన్నట్టు వినిపించే మాటలను వింటూనే వుంటాం. అందుకే శర్మిష్ట అనే యువతిని కట్నం తేలేదని డాక్టర్ భర్త చంపాడనే తరహా వార్తలను చదవాల్సి వస్తోంది. పేపర్ తీస్తే ఎక్కడోచోట కట్నానికి ఆహుతైన మహిళ వార్త కనపడకుండా పోని పరిస్థితి వుంది. అందుకనే సమస్యలో సమాజ గమనమూ, దాని వైకల్యాలూ ఉన్నాయి. ఇవి రూపుమాసిపోయే వరకూ పోరాడాల్సిందే. అంతవరకూ మొదట పేర్కొన్న యువతుల ధైర్య సాహసాలను ప్రేరణగా తీసుకోవాలి. చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా సర్కారుపై వత్తిడి తీసుకురావాలి. నిందితులను శిక్షించేలా పట్టుబట్టాలి. ◆



అమ్మాయిలూ మారాలి

వినియోగదారీ సంస్కృతి వ్యామోహం ఇతరత్రా కారణాలు కట్నానికి ఆజ్యం పోస్తున్నాయనుకుంటే దీనికి ఆమోదించి తలవంచడాన్ని అమ్మాయిలు కూడా తప్పుగా అనుకోవడం లేదు. ఎంతెంతో కట్నమిచ్చి యోగ్యుడిని (?) పెళ్లి చేసుకున్నా విధి వక్రించి, కర్మకాలి తమ బ్రతుకులు నాశనమయ్యాయని వాపోయే అమ్మాయిలకు కొదవ లేదు. ఈ తరహాసిద్ధాంతాలు వారి నరనరాన జీర్ణించుకు పోవడానికి ఈ సమాజం వారిపై రుద్దిన భావజాలం కారణం. ఎంతో చదువుకుని హైటెక్ పరిజ్ఞానం వుందనుకున్న అమ్మాయిలు సైతం అధికులు ఇలాంటి భావజాలాన్నే ప్రదర్శిస్తుంటారు. ముందు తమను తాము తక్కువగా అంచనా వేసుకునే ధోరణి నుండి బయటపడాలి. నమ్మకం, అభిప్రాయాలలో పరస్పర విశ్వాసం పెళ్ళికి పునాదులుగా అనుకునే అత్యుత్తమ సమాజాన్ని అభిలషించాలి. కట్నం పేరిట మారణహోమం సృష్టిస్తున్న వారితో పాటు ఈ సమాజం ఉన్నత విలువలకు కట్టుబడిన వ్యక్తులనూ కలిగి వుంది. అలాంటి వారి సహకారంతో తనను తాను నిలబెట్టుకొనేందుకు ప్రయత్నించాలి. మహిళల జీవితాలను కాలరాస్తున్న వెర్రిమొర్రి విధానాలను నిలవరించేందుకు నడుకట్టాలి.



తలనొప్పిని అశ్రద్ధ చేయొద్దు

*డా॥ బి.సుబ్బారావు

తలనొప్పి వస్తున్న ప్రతి మనిషికి కంటి పరీక్ష అతి ముఖ్యమైనది. ఎందుకనగా నూటికి 35 శాతం నుండి 50 శాతం వరకు తలనొప్పి కలవారిలో కంటికి సంబంధించిన కారణాలు వుంటాయి.

అద్దాల పవరు అవసరం వలన కావచ్చు లేక గ్లాకోమా (నీటికాసులు లేక కంటినీటిపోటు) కావచ్చు లేక కంటి కండరముల శక్తి తక్కువైనపుడు (కన్వర్‌జన్స్ వీక్‌నెస్) కావచ్చు లేక ఒకోసారి మెదడుకు కంటికి సంబంధించిన న్యూరో ఆఫ్తాల్మిక్ ప్రాబ్లమ్ అయి వుండవచ్చు. ఇంకా అనేక కారణాలుండవచ్చు.

కాబట్టి తలనొప్పే కదా అని అశ్రద్ధ చేసి కళ్ళ పరీక్ష చేయించని యెడల ఒకోసారి కంటి చూపుకే తీవ్ర విఘాతం రావచ్చు. ముఖ్యంగా 'గ్లాకోమాలో' మెల్లమెల్లగా పూర్తిగా చూపు తగ్గే ప్రమాదముంది. అలాగే మెదడు - కంటి సంబంధమైన వారిలో వచ్చే తలనొప్పికి ఒకోసారి కంటి నరం మీద మెదడులో జరిగే ఒత్తిడి మార్పులు వస్తాయి. అందువలన ఈ కంటి నరమును పరీక్ష చేసి మెదడులో జరిగే పరిస్థితిని ముందుగా మెదడు డాక్టరుకు తెలపాల్సిన సూచనలు కంటి నరం మీద ప్రస్ఫుటమవుతాయి.

కంటి పవరులో మార్పుల వలన పిల్లలు కాని, పెద్దలు కాని తాము చేసే పనులలో పూర్తి నిఘా వుంచలేరు. ముఖ్యంగా హ్రస్వదృష్టి (మయోపియా) కలవారికి దూరపు చూపు కనిపించదు. పుస్తకములు కంటికి చాలా దగ్గరగా వుంచి చదువుతారు. అలాగే కొద్దిసేపు చదివిన వెంటనే అలసిపోతారు. కండ్లు లాగినట్లు అనిపించడం కూడా ఉంటుంది. దీర్ఘదృష్టి దోషం గల వారిలో విపరీతమైన తలనొప్పి, ఒకోసారి వాంతులు కూడా అవుతాయి. తల అంతా తిరిగినట్లు అనిపిస్తుంది. మెదనరాలు, కణతలు, తలమీద కండరాలు లాగుతున్నట్లు అనిపిస్తుంటాయి. తలనొప్పి మాత్రలు వేసుకున్నప్పుడు మాత్రమే తగ్గుతుంది. మరల వస్తుంది. సంవత్సరాల తరబడి తలనొప్పి మాత్రలు వేస్తుంటారే కానీ, ఒకసారి కంటి డాక్టర్‌కు చూపిద్దామనే ఆలోచన చాలా తక్కువ మందికి వస్తుంది. ఎందుకంటే కంటికి సరిపడే పవరు అద్దాలు వాడడం మొదలు పెట్టిన కొన్ని రోజులలోనే తలనొప్పి పూర్తిగా మటుమాయమవుతుంది. తరువాత తను చేసే పనులు విద్య లేక ఉద్యోగం మొదలగు వాటిలో సంతోషంతో తృప్తిగా పనులు చేస్తూ వుంటారు. కంటికి సరిపడు పవరు వాడకుండా వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఎన్ని మందులు వాడినా తాత్కాలిక ఉపశమనమే కాని ఏ మాత్రం ఫలితం ఉండదు. పైగా అతిగా మందులు వాడినందువలన ఇతర దుష్ఫలితాలు కూడా వస్తాయి.

దయాబెటిస్ రోగులు :

ఈ జబ్బుతో 10 నుండి 15 సంవత్సరాలు బాధపడుచున్నవారికి కంటికి సంబంధించిన మార్పులు వస్తాయి. వీరిలో శుక్లము (కాటరాక్స్) మిగిలినవారి కంటే తొందరగా వస్తుంది. అంతేకాకుండా త్వరగా కూడా ముదురుతుంది.

ఇంకా రెటీనాలో కలిగే మార్పులను 'దయాబెటిక్ రెటినోపతి" అంటారు. జబ్బు ముదరకుంటే బాక్‌గ్రౌండ్ స్టేజి అంటారు. ఇందులో చిన్న రక్తనాళాలు కొంతవరకు దెబ్బతింటాయి. రక్తనాళాలు అక్కడక్కడ ఉబ్బుతాయి. చూపు కేంద్ర దగ్గర ఈ మార్పులు ఎక్కువగా వుంటే చూపు చాలా తగ్గుతుంది. ఈ దశలో కనుక్కొని లేజర్ ట్రీట్‌మెంట్ చేస్తే వున్న చూపుకు ప్రమాదం లేకుండా వుంటుంది. దీనికి డయోడ్ లేజర్ వాడటం చాలా మంచిది. వైద్యం చేయించుకోవడానికి ముందే డయోడ్ లేజరు వుందా లేదా అని తెలుసుకొని, తరువాత ఆ లేజర్‌తో ట్రీట్‌మెంట్ పొందుట మంచిది. ముఖ్యంగా చూపు కేంద్రం దగ్గర డయోడ్ లేజరు వాడటం చాలా మంచిది.

దయాబెటిక్ జబ్బు వలన కంటిలో మార్పులు బాగా ముదిరినపుడు కలిగే వానిని ప్రొలిఫరేటివ్ దయాబెటిక్ రెటినోపతి అంటారు. ఇందులో రక్తనాళాలు ఉబ్బటమే కాకుండా, రక్తనాళం చిట్లి ఉంటుంది. రక్తంలోని కొన్ని కొవ్వు పదార్థాలు కూడా రెటీనా మీద విస్తరించి వుంటాయి. అక్కడక్కడ చిన్న రక్తనాళాలు సరిగా పని చేయకుండా వుంటాయి. అంతేకాకుండా కొత్త కొత్త రక్తనాళాలు పుట్టి పెరుగుతూ వుంటాయి. దీన్నే నియోవాస్కులరైజేషన్ అంటాము. ఈ కొత్త రక్తనాళాల గోడలు చాలా సున్నితంగా వుండి, తొందరగా పగలి వీటి

ద్వారా రక్తం కంటిలో చిట్లి కంటి రెటీనా పొరమీద కాకుండా కంటిలో ఉండే బంకలాగా వుండే విట్రియస్ అనే ద్రవంలో చేరి చూపుకు ప్రమాదం తెస్తుంది. తరువాత ఈ రెటీనా పొరలు విడిపోవడం జరగవచ్చు. ఒకోసారి విట్రియస్ ఆపరేషన్ కూడా చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ దశలో ఇంకా రెటీనా బాగా కనిపిస్తూ ఎక్కువ రక్తం విట్రియస్‌లో చేరకుంటే లేజర్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం చాలా ముఖ్యం. దీనివలన కొత్త రక్తనాళాలు తగ్గిపోయి కాంప్లికేషన్స్ తగ్గుతాయి.

అందువలన ప్రతి డయాబెటిక్ రోగి ప్రతి 6 నెలలకొకసారి కంటి పరీక్ష చేయించి తదనుగుణంగా అవసరమైతే లేజరు ట్రీట్‌మెంట్ చేయించుకోవడం అవసరం.

ఒకోసారి దయాబెటిక్ పేషంట్లలో నీటికాసులు కూడా మామూలు వారి కంటే ఎక్కువగా వస్తూ వుంటుంది. నీటికాసులకు సంబంధించి పరీక్ష చేయించుట కూడా చాలా ముఖ్యం.

(1) స్కూలుకు, కాలేజీకి వెళ్ళే ప్రతివారు తమ కళ్ళను కనీసం స్కూల్లో, కాలేజీలో చేరే ముందు తప్పనిసరిగా పరీక్ష చేయించుకోవడం అవసరం. ఎందుకంటే ఈ దశలో జబ్బు గురించి సరైన నివారణ చేయగలిగితే చూపు బాగా వుండి వారి స్కూలు, కాలేజీ జీవితంలో అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది.

(2) రక్తపు పోటు : ఈ జబ్బు వలన కంటిలోని రక్తనాళాలు సన్నబడిపోతాయి. ఒకోసారి రక్తం సరిగా ప్రవహించకుండా కొన్ని నాళాలు దెబ్బతింటాయి. తరువాత కొంతకాలానికి కొత్త రక్తనాళాలు ఏర్పడి రక్తపోటు మార్పుల ననుసరించి రక్తనాళాలు చిట్లి కంటిలో రక్తం కూడుతుంది. దీనిని విట్రస్ హెమరేజ్ అంటాము. ఈ రకమైన జబ్బులు కొంతవరకు రాకుండా జాగ్రత్త పడటానికి, వచ్చినా వీలైనంత త్వరలో తగు జాగ్రత్తలు తీసుకోవడానికి కంటి పరీక్ష ఎంతో అవసరం. రెటినల్ వీన్ అక్లూజన్ వలన ఒకోసారి 'నియోవాస్కులర్ గ్లాకోమా' కూడా వస్తుంది.

(3) ఎపిలెప్సి, నరాల సమస్య వున్న వారికి కంటిలోని నరం మామూలుగా వున్నదా లేక నరం వాచి వున్నదా అని తెలుసుకోవడానికి కంటి పరీక్ష అవసరం ఎంతో ఉంటుంది. ఎందుకంటే ఈ నరం స్థితిగతులను బట్టి వైద్యంలో నరాల నిపుణుడు మార్పు చేయుటకు తోడ్పడుతుంది.

(4) 40 సంవత్సరాల తరువాత ప్రతి ఒక్కరికీ కంటి పరీక్ష ఎంతో ముఖ్యం. ఎందుకనగా కొన్ని రకాల కంటి జబ్బులు ఎక్కువ మందిలో ఈ సమయంలో మొదలవుతాయి. ముఖ్యంగా చత్వారం, నీటి కాసులు మొదలగు జబ్బులు, చత్వారానికి కళ్ళజోడు వాడవలసి ఉంటుంది.

(5) కొన్ని వృత్తులలో పని చేసే వారు, వివిధ రకాల పారిశ్రామిక కార్మికులు, డ్రైవర్లు మొదలగు వారికి కూడా కంటి పరీక్ష చాలా అవసరం.

కంటి ఆపరేషన్లు మైక్రో సర్జరీ ద్వారా చేయించుకోవడంచాలా ఉత్తమం. అందువలన సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. రోగి త్వరగా తనదైనందిన కార్యక్రమాలకు వెళ్ళవచ్చు. అత్యాధునిక కంటి ఆపరేషన్‌లకు మైక్రో సర్జరీ చాలా ముఖ్యం.

(6) కంటిలో నలుసులు పడినా, కంటికి దెబ్బ తగిలినా అజాగ్రత్త చేయకుండా సరైన ట్రీట్‌మెంట్ తీసుకుంటే కంటిని, కంటి చూపును చాలా వరకు కాపాడుకోగలం. కంటికి చిన్న గాయమైనా ఒక్కోసారి చూపు చాలా తగ్గిపోవచ్చు.

(7) క్లామ్ప్సియా మొదలగు జబ్బులకు గురైనపుడు గర్భిణీ స్త్రీలకు కూడా కంటిపరీక్ష చాలా అవసరం. కంటి నరం ఉబ్బిపోయి, చూపుకు ప్రమాదం కలిగినపుడు వెంటనే ప్రసవం చెయ్యాల్సి రావచ్చు.

(8) హ్రస్వదృష్టి కలవారు రెటీనా పరీక్ష చేయించుకొనుట చాలా ముఖ్యం. ఎందుకంటే వీరిలో ఒక్కోసారి రెటీనా బలహీన పడి రంధ్రాలు పడి విడిపోయే ప్రమాదముంది. అందువలన బలహీన భాగాలను లేజర్ లెన్సెస్‌ద్వారా ముందుగానే గుర్తించి వారికిసరైన నివారణ కొంతవరకు చేయుటకు వీలవుతుంది. ఒక్కోసారి రెటీనా విడిపోతే తక్షణమే ట్రీట్‌మెంట్ చేస్తే చాలా వరకు విజయం సాధించవచ్చు. ఇంకా అనేక రకాల జబ్బులలో కంటి పరీక్ష చాలా అవసరమవుతుంది.

కంటి ప్లాస్టిక్ సర్జరీ :

కనురెప్పలు వాలిపోతే దానికి కంటి మైక్రో సర్జరీ చేసి రెప్పలను మరలా పైకి లేపవచ్చు. కంటి రెప్పలకు గాయాలు అయినపుడు కంటి మైక్రో సర్జరీ ద్వారా కుట్లు వేస్తే గాయాల మచ్చలు తగ్గుతాయి.

కంటి కురుపులు :

కంటి రెప్పలకు వచ్చే 'కలేజియన్' అను మైక్రో సర్జరీ ద్వారా ఆపరేషన్ చేస్తే మంచిది. ఇటువంటి వారిలో దృష్టి దోషాలు కూడా వుండవచ్చు. అందువలన తరచుగా కంటి కురుపులు వచ్చే వారు తప్పనిసరిగా కంటి పరీక్ష చేసుకొనుట మంచిది.

మెల్లకన్ను :

మెల్లకన్ను వున్న వారు తప్పనిసరిగా కంటి పరీక్ష చేయించుకొని, అద్దాలు, అవసరమైతే ఆపరేషన్ కూడా చేయించుకుంటే మెల్ల చాలా వరకు తగ్గిపోతుంది.

గ్లాకోమా జబ్బు :

40సంవత్సరాల పైబడిన వారిలో ఎక్కువగా వస్తుంది. అందువలన ఇంట్రా ఆక్యులర్ ప్రెజర్ అపుడపుడు చెకప్ చేస్తూ వుండాలి. కంటినరం ప్రెజర్‌ను బట్టి గ్లాకోమా జబ్బును నిర్ధారిస్తాం. ఆధునిక పరికరాలతో పరీక్ష చేసి, ఏ మాత్రం అనుమానం వున్నా మందులతో చికిత్స ప్రారంభించాలి. మందులతో తగ్గకుంటే లేజర్ చికిత్స అవసరం. అపుడు కూడా జబ్బు తగ్గకపోతే ఆపరేషన్ చేసి జబ్బును తగ్గిస్తాయి. ◆



బలమున్నవాడిదే రాజ్యం



* అంపశయ్య నవీన్

"అబ్బబ్బ! ఏం ఎండలండీ బాబూ! చచ్చిపోతున్నాం. ఈ ఎండాకాలం వెళ్ళి పోయేటప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో ఎవరన్నా మిగులుతారా అని నాకో సందేహం... గత పాతిక సంవత్సరాల్లో నేనింత భయంకరమైన ఎండల్ని చూళ్ళేదంటే నమ్మండి!" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు, విపరీతంగా ఆయాసపడిపోతూ.

"మీరన్నమాటే అందరూ అంటున్నారు. టీవీ, రేడియో, వార్తా పత్రికలు లాంటి ప్రసారమాధ్యమాలన్నీ ఆంధ్రప్రదేశ్ అగ్నిగుండంగా మారిందని, ఆ అగ్నిగుండానికి వేలాది మంది ప్రజలు ఆహుతైపోతున్నారని ఘోషిస్తున్నాయి. అనేక పట్టణాల్లో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీ సెల్సియస్ వరకు పెరిగిపోతున్నాయట... మనం నివసిస్తున్న మన హనుమకొండ పట్టణంలోనే ఈ సంవత్సరం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతున్నదట. 47, 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత స్థాయి పెరిగిపోతున్నదట... పగలూ, రాత్రీ అన్న వ్యత్యాసం లేకుండా వడగాడ్పులు నిరంతరం వీస్తూనే ఉన్నాయి. ఇంట్లో ఉన్నా, బయటికెళ్ళినా నిప్పుల కొలిమిలో ఉన్నట్టే ఉంది. రోజూ ఈ వడగాడ్పుల ధాటికి వందమందో, రెండు వందల మందో చనిపోతున్నారనీ, వడదెబ్బ మృతుల సంఖ్య ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 1200లకు చేరుకుందని పత్రికల్లో చదువుతున్నాం. ఇంతమంది చనిపోయారా? అని ఎవరూ ఆశ్చర్యపడటం లేదు - ఇంతమంది చనిపోయారన్నది ఒక అంకెగా మారిపోయింది. మొన్న వెయ్యి, నిన్న వదకొండొందలూ, ఇవ్వాళ్ళ పన్నెండొందలు... వడదెబ్బ తాకిడికి చనిపోతున్న వాళ్ళంతా ఎవరు? - కూడు, గూడూ లేని పేదవాళ్ళే... రెక్కాడితే గానీ డొక్కాడని శ్రామికులే... ఇంతటి మండుటెండల్లో రోజూ ఏడెనిమిది గంటలు నెత్తిమీద ఎలాంటి నీడా లేకుండా పని చేసే శ్రామికుల్నెందర్నో మనం చూస్తుంటాం... వడదెబ్బకు గురై చనిపోయే వాళ్ళు వీళ్ళే.. ఇంతటి భయంకరమైన ఎండల్లో పని చెయ్యొద్దని, పని చేయించొద్దని వీళ్ళనెవరైనా ఆపుతున్నారా? పత్రికల వాళ్ళు రోజూ వడదెబ్బకు ఇంతమంది చనిపోతున్నారని అంకెల్ని ప్రచురించి తృప్తి పడుతున్నారే తప్ప ఈ చావుల్ని ఎలా ఆపాలో సూచిస్తున్నారా? ప్రభుత్వం వారు ఇంతమంది చనిపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప ఈ చావుల్ని ఆపడానికి ఏమన్నా చర్యలు తీసుకుంటున్నారా? ఎండలో నిల్చొని పని చేసే వాళ్ళు పని గంటల్ని ఈ వేసవి కాలానికి అనుగుణంగా మారుస్తున్నారా? ఆఫీసు వేళల్ని మారుస్తున్నారా? ఇంతటి మండుటెండల్లో కూడా పని గంటలు ఉదయం పది నుండి సాయంత్రం ఐదు వరకే ఉండాలా? ఉదయం ఏడింటి నుండి పన్నెండు వరకని మార్చకూడదా? శరీర శ్రమను అమ్ముకుని బతికే శ్రామికుల పని గంటల్ని కూడా ఉదయం ఏడింటి నుండి పదింటి వరకు, సాయంత్రం ఐదింటి నుండి ఏడింటి వరకో, ఎనిమిదింటి వరకో మార్చకూడదా? వడదెబ్బ మృతులకు యాభైవేల చొప్పున నష్టపరిహారం చెల్లించడం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఆర్థిక సహాయం చెయ్యమని అడగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదట! చనిపోయాక నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆలోచించడం కాకుండా అసలు ఈ చనిపోవడాన్నే ఆపే ప్రయత్నం చెయ్యొచ్చు కదా...

'ఎయిడ్స్'ని అరికట్టడం ఎలాగో చెప్పడం కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు పెడుతున్నది. అలాగే వడదెబ్బనుండి ప్రజల్ని కాపాడటానికి కోట్లు కాకపోయినా కొన్ని లక్షలన్నా ఖర్చు పెట్టొచ్చు కదా... కేవలం ఇంతమంది చనిపోయారని అంకెల్ని ప్రచురిస్తే ఒరిగేదేముంది? పూర్వం ఒకాయన అన్నాట్ట... ఒక్కడు చనిపోతే విషాదం... ఒకరికంటే ఎక్కువ మంది చనిపోతే అంకెలు మాత్రమే అని. నిండు ప్రాణాలు పోతున్నాయని బాధపడటం పోయి ఇంతమంది చనిపోయారని కొన్ని అంకెల్ని వల్లించడం మనకలవాటై పోయింది. ఇంతమంది చనిపోయారంటే 'అయ్యో!' అని బాధపడటం మనం ఎప్పుడో మరచిపోయాం. అన్నీ అంకెలే! ఇన్ని లక్షల మందికి 'ఎయిడ్స్' సోకింది. ఇన్ని లక్షల మందికి 'సార్స్' సోకింది... ఇన్ని లక్షల మంది మందుపాతరల వల్ల చనిపోయారు. ఇన్ని లక్షల మంది టెర్రరిస్టుల దాడుల్లో చనిపోయారు. ఇన్ని లక్షల మంది విమాన ప్రమాదాల్లో చనిపోయారు. ఇన్ని లక్షల మంది రైలు ప్రమాదాల్లో చనిపోయారు. ఇలా అంకెల్ని వల్లించడం తప్ప వీటిని నివారించడానికి మనమేమన్నా నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామా?" అన్నాను నేను.

"ఒకవైపు ఇలా ఎండలు మండిపోతున్నాయా? మరోవైపు కరువు... ప్రజలకు తిండి లేదు... నీళ్ళు లేవు... అలో లక్ష్మణా అని అలమటిస్తున్నారు..." అన్నాడు పుల్లారావు.

"కరువు... కరువు అంటున్నారు... ఎవరికి కరువు? మార్కెట్లో బియ్యం పుష్కలంగా లభిస్తున్నాయి. కాకపోతే చాలా ఎక్కువ ధర పెట్టి కొనుక్కోవాలి... ఇవాళ కింది మధ్యతరగతి వాళ్ళు, మీది మధ్య తరగతి వాళ్ళు, ఉన్నత వర్గాల వాళ్ళూ మార్కెట్లో లభిస్తున్న వస్తువులన్నింటినీ ఎంత ధరైనా చెల్లించి కొనుక్కుంటూనే ఉన్నారు. ఈ మండుటెండల్లో ఈ కరువు కాలంలో కూడా అన్ని విలాస వస్తువుల అమ్మకాలు పెరిగాయని పత్రికల్లో చదవడం లేదా? కార్ల అమ్మకాలు, మోటారు సైకిళ్ళ అమ్మకాలు, ఎయిర్ కండిషనర్ల అమ్మకాలు, ఫ్రిజ్‌ల అమ్మకాలు, బీర్ల, విస్కీల, బ్రాందీల అమ్మకాలు, సెల్‌ఫోన్ల అమ్మకాలు, బంగారం అమ్మకాలు, ఇలాంటి విలాస వస్తువుల అమ్మకాలన్నీ ఈ వేసవిలో విపరీతంగా.. వ్యాపార వర్గాల వారు కూడా ఊహించలేనంత విపరీతంగా పెరిగి పోయాయట... కాబట్టి కరువు ఎక్కడుంది? పేదవాళ్ళకు తప్ప మిగతా వర్గాల వారి మీద కరువు ప్రభావం ఏమన్నా కనిపిస్తున్నదా? పల్లెటూళ్ళలో తప్ప పెద్ద పట్టణాల్లో కరువు ప్రభావం ఏమన్నా కనిపిస్తున్నదా? మనం చాలా విచిత్రమైన ఆర్థిక వ్యవస్థలో జీవిస్తున్నాము. కరువు పేరుతో, పేదరిక నిర్మూలన పేరుతో ప్రభుత్వం కోట్లకు కోట్లు ఖర్చు పెడుతున్నది. ఈ కోట్లు ఎవరి జేబుల్లోకెళ్తున్నాయా? దారిద్ర్యరేఖకు కిందనున్న వాడి జేబుల్లోకే వెళ్తున్నాయా? ప్రభుత్వ ధనాన్ని ఎవడికి చేతనయినంత వాడు దోచుకుంటూనే ఉన్నాడు. బాగుపడేవాడు బాగుపడుతున్నాడు - చెడిపోయేవాడు చెడిపోతున్నాడు - మైటీజ్ రైట్. బలమున్నవాడిదే రాజ్యం!" అన్నాన్నేను. ◆

కబేళా దారిలో..

గోవుతల్లి కోడెదూడేసినపుడే
నట్టింట్లో నేను నెత్తురు పూవై పూసింది.
దూడా, నేనూ పొదుగును పంచుకొని
పాలు కుడిచేవాళ్ళం.
నా చిన్నతనమంతా
లేగదూడతోనే గంతులేసేది.
దూడ దుక్కిటెద్దయినపుడే
నేను ఏరుపిడి అందుకున్నాను.
ఎద్దు జతకు ఎద్దును కొనితెచ్చి
మేము ముగ్గురిమయ్యాము.
మెడలో గంటలు
కొమ్ములకి పస మువ్వలు కట్టి బండి పూస్తే
ఊరు ఊరంతా ఉత్సవమయ్యేది.
పెంటగత్తం నెత్తికెత్తుకొని
మడిలో ముగ్గేసినపుడు
మూగబాసేదో మా ముగ్గురికే ఎరుకయ్యేది.
బతుకు పలుపు ఎద్ల మెడకు చుట్టి
బురద బుక్కి బురద కక్కేవాడ్ని.
ఏడాది రెక్కల కష్టం ఎడ్ల మూపునేసి
సంకురాతిరికి పంటగా ఇంటికొస్తే
కనుమునాడు ఎడ్ల మెడలో అప్పాల దండలు కిలకిలనవ్వేవి.
మొఱ్ఱాట పూసుకొని
మా ఇంట రంగుల పండగే జరిగేది.
దుక్కిటెడ్లంటే.. నా దేహంలో భాగమే.
పశువుల శాలంటే... నాకు పర్ణశాలే.
దమ్ము మడిలో ముగ్గురము దొర్లి దొర్లి
ఏపుగా ఎదిగిన పంటచేనును కలగనే వాళ్ళం.
మా కల కందుబారి పోయి
కరువు తోడేలై కళ్ళంలో ఊళేసింది.



కంటి ముందు పరచుకున్న ఎడారి దృశ్యం
గాడితట్టలో ఎండు గడ్డి పరకైనా మేతకు లేక
ఎముకల గూళ్ళయి చిక్కిన దుక్కిటెద్లు,
కరువును నెమరు వేస్తూ కన్నీరు తాగుతున్నాయి.
ఇపుడు....
నా ఆత్మను అంటుకట్టుకొని కబేళా దారిలో... నా దుక్కిటెద్లు
కరువు వాగులో కొట్టుకుపోతూ.... నేను.

✻ చిరికి స్వామినాయుడు

రక్తదాహం

నాగరికత నరాలు తెగి ప్రవహిస్తేగాని
వాడి దాహం తీరలేదనుకుంటా
నిజంగా... వాడు
ఏ రాక్షసుడో, రాబందువు కాకపోతే
ఇంతలా దాహం వేస్తుంటుందా
ఇంత రక్తం తాగాడు
వాడికి ఇంతలా ఆకలేస్తుంటుందా
ఇన్ని శవాలు కాల్చుకుతిన్నాడు
అరే భాయ్
ఈ శతాబ్దపు శాంతిదూత
యుద్ధం పేరుతో నాగరికతను మింగేశాడు
పిల్లలు నాగరికత గురించి అడిగితే
జవాబు తొరకటంలా
దిక్కులు చూస్తే
ప్రపంచాన్ని జయించి వట్టి చేతులతో వెళ్ళిన
అలెగ్జాండర్ గుర్తొస్తున్నాడు
కళింగ సామ్రాజ్యంలో
రక్తపు హోళి ఆడిన
అశోకుడికైన జ్ఞానోదయం గుర్తొస్తుంది.



ఆంక్షల వేటులో
ఉత్తరకొరియా పసిపిల్లల
ఆకలి కేకలు వినబడుతున్నాయి.
భగ్గుమంటున్న పశ్చిమాసియాలో
చితికిన బ్రతుకు దృశ్యాలు కనబడుతున్నాయి.
పసిపిల్లల రోదనతో
ఇరాక్ బిక్క చచ్చి ఉంటుంది.
యుద్ధం సృష్టించిన బీభత్సంతో
ఛీతిల్లిన మెసపటోమియా నాగరికత
గుండె వెయ్యి ముక్కచెక్కలై ఉంటుంది.
ఆకాశాన్ని అంటిన నిరసన నినాదాలు
వాడి కర్ణభేరిని అంటలేక పోయాయ్
శాంతి...
రెక్కలు తెగిన పావులమయ్యింది.
ఇప్పుడక్కడ
దోపిడికి గురైన బ్రతుకుల్ని
ధ్వంసమైన బ్రతుకుల్ని
శిధిలమైన బ్రతుకుల్ని
వెలకట్టే బృందాలు
తెల్లకాగితాల మీద అక్షరాలై మొలుస్తాయి.
ఇప్పుడెక్కడ చూసినా
సమాధులతో నిండి ఉన్న శ్మశానాలు
కిరాతక యుద్ధం పాతిన
సమాధి రాళ్ళ మధ్య
పిల్లల కోసం రోదిస్తున్న తల్లులు
తల్లుల కోసం రోదిస్తున్న పిల్లలు....

✻ ముచ్చర్ల 'ఇబ్రహీం'

బాలవికాసం

ఆది నుండి ఆటపాటలతో అక్షరాభ్యాసం



* వి.ఆర్.వాగోలు

'మా వాడికి రోజులు గడుస్తున్నా అక్షరాలే ఉచ్ఛరించడం రావడం లేదు. రెండు మూడు స్కూల్స్ మార్చినా పరిస్థితిలో మార్పు కానరాలేదు. ఏమి చేయాలో తోచడం లేదు అని మిత్రుడు ప్రసాద్‌తో అన్నాడు రామారావు.

అపుడే మీ వాడు అన్నీ బట్టీ పట్టేయాలనుకుంటున్నావా ఏమిటి? ఇంతకూ మీ వాడి వయసెంత? వాడు చదివే చదువెంత? మరీ పిల్లవాడి చదువుపై ఇప్పటి నుండే దిగులు పెట్టుకోకు. చదువు అదే వస్తుంది అని మిత్రునికి అభయమిచ్చాడు ప్రసాద్.

అంతేనంటావా? మాపిల్లవాడికి అక్షరాలు స్పష్టంగా ఉచ్ఛరించడం, అక్షరాలు గుర్తుపట్టడం అబ్బుతాయంటావా? మా పిల్లవాడి వయసు కలిగిన పిల్లలెంతో హుషారుగా వల్లె వేస్తుంటే వీడేమో తనకేమీ పట్టనట్లుంటున్నాడు" అన్నాడు.

"దాని గురించి అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదు. బాలబాలికలలో ఒక్కొక్కరికి ఒక్కొక్క రకమైన గ్రాహ్యక శక్తి ఉంటుంది. నిదానంగా వాడే నేర్చుకుంటాడు" అని సర్ది చెప్పాడు.

వేరొకరి పిల్లలతో తమ పిల్లలను పోల్చుకుంటూ పొరపాటున తమచిన్నారి ఇతరుల కంటే ఏ విషయంలోనైనా తక్కువగా వుంటే కొంతమంది తల్లిదండ్రులు నానా హడావుడి పడిపోతుంటారు. మనుషులందరికీ ఒకే రకమైన తెలివితేటలు గాని, గ్రాహ్యక శక్తిగాని ఉండవు. అంతమాత్రం చేత గ్రాహ్యక శక్తి తక్కువగావున్న వారు చెబితే నేర్చుకుంటే, కొందరు రెండుమూడుసార్లు, మరికొందరికి అంతకంటే ఎక్కువసార్లు చెబితే కాని అర్థం కాదు. దానికి అనేక కారణాలుంటాయి. అందుకనే తల్లిదండ్రులు పిల్లల తెలివితేటలు, వారి గ్రాహ్యక శక్తి పట్ల గాభరా పడరాదు. దీనివల్ల ఉపయోగం ఉండకపోగా అది పిల్లల మనసుపై వ్యతిరేక ముద్రపడి వారు మరింత మూఢులుగా తయారయ్యే అవకాశం ఉంది.

తల్లిదండ్రులు పిల్లలను ఇతర పిల్లలతో పోల్చి తమ పిల్లలకు లేని, ఇతర పిల్లలలో ఉన్న ఉత్తమ లక్షణాలను బట్టి వీరిని కించపరచకూడదు. ప్రతి విషయానికి వాడు చూడుఎలా ఉన్నాడో, వీడుచూడు ఎంత చక్కగా చదువుతు న్నాడో అంటూ చిన్నారులను విసిగించకూడదు. దానికి బదులు తమ బుడతలలో ఉన్న, ఇతరులలో లేని చురుకైన, మంచి గుణాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలి.

మనుషులలో విమర్శకన్నా, పొగడ్త, ప్రోత్సాహం ఉత్తమ ఔషధాలుగా పని చేస్తాయి. అందుకని వీరిలోని మంచి లక్షణాలతో పాటు లేని లక్షణాలను కూడా నెమ్మదిగా అలవరచుకోవాలని, అందుకు కొద్దిపాటి ప్రయత్నం చేయాలని వారికి ఉద్బోధించాలి.

బాల్యంలోనే తల్లిదండ్రులు చిన్న చిన్న సూత్రాలు పాటించడం ద్వారా పాఠశాల వయస్సు వచ్చేటప్పటికే అక్షరాలు, చిన్న చిన్న తెలుగు పద్యాలు, ఆంగ్ల పద్యాలు, సంఖ్యలు మౌఖికంగా పిల్లలు నేర్చుకొనేలా చేయవచ్చు. చిన్నారులు తమ పరిసరాలను నిశితంగా గమనిస్తూ ఉంటారు. దానితో పాటు పరిసరాలలోని శబ్దాలను చక్కగా ఆలకిస్తుంటారు. అలా పరిశీలన, గ్రాహ్యక శక్తి, శ్రవణం ద్వారా పరిసరాలలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన ఏర్పరచుకుంటారు. కొంతకాలానికి తాను పరిశీలించిన, గ్రహించిన విషయాలను తిరిగి ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నానికి మొదటి మెట్టే అనుకరణ.

కనుక చిన్నారులను తల్లిదండ్రులు, పెద్దలు ఆడించేటపుడు వారికి చిన్న చిన్న తెలుగు, ఇంగ్లీషు పదాలు, పద్యాలు, సంఖ్యలతో పాటు కథలు వినిపించాలి. పెద్దలు మాట్లాడుతున్నపుడు వారు శ్రద్ధగా ఆలకించడం స్పష్టంగా గమనించవచ్చు. ఇదివరలో పెద్దవారు పిల్లలను తమ వద్ద పరుండబెట్టుకొని ఎన్నో కథలు చెప్పి ఎన్నెన్నో పాటలు పాడేవారు. ఆ పాటలు, కథలను వింటూ నెమ్మదిగా చిన్నారులు, నిద్రమాత కౌగిలిలోకి జారిపోయేవారు.

నేడు ఆ పద్యాలు, పాటలు, కథలు దాదాపు కనుమరుగైనాయని చెప్పవచ్చు. తల్లిదండులు చిన్న చిన్న తెలుగు, ఇంగ్లీషు పద్యాలు, గీతాలు ఆలపిస్తూ ఉంటే తప్పక అవి బాలల మదిలో ముద్రవేసుకుపోతాయి. అలాగే బొమ్మలున్న కథల పుస్తకాల సంఖ్యలు, అంకెలను చూపుతూ వారికి నేర్పిస్తుంటే సహజంగా, కష్టం లేకుండా సులభంగా పిల్లలు గ్రహించగలుగుతారు. త్వరలోనే అనుకరణ రూపంలో వీటిని మరలా వారు చెప్పే ప్రయత్నం చేస్తుంటారు. ఒకవేళ మనముందు చెప్పకపోయినా వారు ఒంటరిగా ఉన్నప్పుడు తాము నేర్చుకొన్న, గ్రహించిన వాటిని మరలా వల్లె వేయటం మనం గ్రహించవచ్చు. ఇలా మొదటి నుండి పాఠశాలలో చేర్పించక పూర్వమే వారికి తెలియకుండానే వారిలో విద్యా కుసుమాలు పూయించడం ద్వారా పాఠశాల చిన్నారుల పాలిట ఒక కారాగారంలా కాక తాను నేర్చుకున్న, తనకు పరిచయమున్న పరిసరమే అన్న స్పృహతో త్వరితగతిన పాఠశాలకు అలవాటు పడి ప్రాథమిక భావనలను సులభంగా, త్వరితంగా నేర్చుకునే అవకాశం ఉంది. ◆

బరువు బాధ్యత

పౌత్రాపురంలో నివసించే పరంధామయ్యది పేద కుటుంబం. ఆయనకు సురేష్ ఒక్కడే కొడుకు. తనకు కావలసిన పుస్తకాలు, పెన్నులు కొనుక్కోవడానికి డబ్బు అవసరమైనప్పుడల్లా తండ్రిని అడిగేవాడు సురేష్. ఉన్నదాంట్లోనే కాదనకుండా ఇవ్వడానికే ఆయన ప్రయత్నించేవాడు. కాని అప్పుడప్పుడు డబ్బులు వుండేవికావు. అప్పుడు మాత్రం కుమారుని కసురుకునేవాడు. అది సురేష్‌కి నచ్చేదికాదు. చాలా కష్టంగా అనిపించేది.

ఓసారి సురేష్‌కు ఒక ఆలోచన వచ్చింది. 'డబ్బు కావలసివచ్చిన ప్రతిసారీ నాన్నని అడిగేది ఎందుకు? నాన్న సంపాదనంతా నాకు ఇచ్చేస్తే.. అవసరాలకు నేనే ఖర్చు పెడతాకదా. మిగిలిన డబ్బును దాచి పెడతాను. అప్పుడు నాకు కావలసినవి కొనుక్కుంటాను' అనుకున్నాడు. ఆ ఆలోచన వచ్చినదే తడవుగా సురేష్ తల్లి దగ్గరకు వెళ్లి విషయం చెప్పాడు. ఆ మాటలు విన్న తల్లి ఎంతో మురిసిపోయింది. కొడుకు చాలా తెలివిగలవాడని, ప్రయోజకుడవుతాడని అనుకుంది. అదే విషయాన్ని భర్తతో కూడా చెప్పింది.

ఆయన నవ్వుతూ... 'దానిదేముందోయ్! ఎలాగూ పెద్దయ్యాక వాడికీ బరువు బాధ్యతలు తెలియాలి. ఇప్పడే బాధ్యతలు తీసుకుంటానంటే నేను మాత్రం వద్దంటానా? అంతకన్నా కావలసింది ఏముంది? తండ్రిని మించిన తనయుడు కావాలనే కదా నా ఆతృతంతా' అన్నాడు.

మరునాటి నుంచి ఇంట్లోకి కావలసిన వస్తువులను సురేష్ తీసుకోసాగాడు. చేతిలో డబ్బు కొద్దిగా వుండేది. అవసరాలు ఎక్కువగా వుండేవి. అన్నీ ముఖ్యమైనవే. ఏదీ పక్కనపెట్టే అవసరం కాదు. ఒకటికి పదిసార్లు ఆలోచించి వస్తువులు కొనవలసి వచ్చేది. అందుకు వాళ్ల అమ్మ కూడా సహకరించింది.

రోజు రోజుకు మార్కెట్‌లో కూరగాయల ధరలు, సరుకుల ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడంలేదు. అంచేత రోజురోజుకు డబ్బు ఖర్చయిపోతోంది. పావలాకూడా మిగలడం లేదు సరికదా పనులన్నీ చూసుకోవడం మూలంగా సురేష్ చదువుకూడా కుంటుపడింది. పబ్లిక్ పరీక్షలు దగ్గరవుతున్నాయి. ఈ పరిస్థితులలో సురేష్‌కు ఏం చేయాలో పాలుపోక పరుగెత్తుకుంటూ తండ్రి దగ్గరకు వెళ్లి బావురుమని ఏడ్చాడు.

'ఏమయిందిరా సురేష్. ఏడుస్తున్నావు?' అని కొడుకును అడిగాడు పరంధామయ్య. అప్పడు సురేష్ 'రోజూ ఇంటికి సంబంధించిన వస్తువులు ఎంత జాగ్రత్తగా తీసుకున్నా కూడా డబ్బు అసలు మిగలడం లేదు. అంతే కాకుండా నాకు సరిగా చదువుకోడానికి కుదరడం లేదు' అని కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పాడు. ఒరేయ్! బాధ్యత ఎంత బరువుగా వుంటుందో నీకిప్పడు ప్రత్యక్షంగా తెలిసిందికదా. బాధ్యత నా మీద వుంటే దాని బరువేంటో తెలియక చాలా తేలికనుకున్నావు. ఇకనుంచైనా నీవు బుద్ధిగా చదువుకుంటూ చిన్న చిన్న పనులలో నాకు సహాయపడు. అప్పడు బరువును మోయడంలో నాకు సహకరించినవాడవవుతావు. అంతేకాని బరువంతా నీ ఒక్కడివే మోసేద్దామనుకుంటే నీకేకదా కష్టం' అని పరంధామయ్య కొడుకుకు హితబోధ చేశాడు.

అమ్మిన శ్రీనివాసరాజు



క్విజ్-61

1. 'విండ్ సిటీ' అని దేనిని పిలుస్తారు?
   ఎ. చికాగో బి. రోమ్
2. మానవ నిర్మిత సంస్థలలో ప్రాచీనమైనది?
   ఎ. మతము బి. కుటుంబము
3. కనిష్కుని ఆస్థానమందలి ప్రసిద్ధ వైద్యుడు?
   ఎ. చరకుడు బి. నాగార్జునుడు
4. 'సన్నీడేస్' రచయిత?
   ఎ. సచిన్‌టెండూల్కర్ బి. సునీల్‌గవాస్కర్
5. అతి చిన్న పక్షి?
   ఎ. కోకిల బి. హమ్మింగ్
6. రెండు బిందువులగుండా గీయగల సరళరేఖల సంఖ్య?
   ఎ. 1 బి. అనేకము
7. దక్షిణాఫ్రికా రాజధాని?
   ఎ. జోహాన్స్‌బర్గ్ బి. జమైకా
8. సబ్బుల తయారీలో ఉపయోగించు వృక్షము?
   ఎ. మల్బరీ బి. ఆలివ్
9. 'పో' నది ఏ దేశములో వుంది?
   ఎ. ఇటలీ
   బి. గ్రీసు
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
    ఎ. మాధవన్
    బి. ఎఆర్.రెహమాన్

చెప్పినట్టు చేసే గుండీ



మేజిక్! మేజిక్!!

నేస్తాలూ... నా దగ్గర ఒక గుండీ వుంది. అది నేను ఎలా చెప్తే అలా చేస్తుంది తెలుసా. నిజంగా నిజం. కావాలంటే చూడండి మరి. అదిగో పై బొమ్మలోలాగా ఒక గ్లాసు నీళ్లు తీసుకున్నాను. అందులో ఇదిగో నే చెప్పినట్టు వినే గుండీ వేస్తున్నా. చూశారుగా. ఆ ఇప్పుడు చూడండి నా మేజిక్. 'ఏయ్ గుండీ పైకి రా'. అదిగో మెల్లి మెల్లిగా పైకి వస్తోంది చూశారా. 'ఓయ్ గుండీ కిందకి దిగు'. ఆ... కదలలేక కదులుతున్నట్టు కిందకి వెళుతోంది గమనించారా. అది నా గుండీ అంటే. నా మాట అంటే దానికి అంత గురి. చక్కగా వింటుంది.

అలా బేలగా చూడకండి పిల్లలూ. మిమ్మల్ని చూస్తుంటే నాకు నిజం చెప్పేయాలనిపిస్తోంది. అది మామూలు గుండీనే. మీ చొక్కాలకు వుంటుందే. అలాంటిదే. కాకపోతే మీరు ఈ మేజిక్ చేయాలంటే కావలసినదల్లా షోడానీళ్లు, గుండీ. అంతే. గ్లాసులో షోడా నీళ్లు పోసి ఒక గుండీని వదలండి. అప్పుడు దాని చుట్టూ బుడగలు ఏర్పడతాయి. అవే గుండీని పైకి లేపుతాయి. గుండీ పైకి వచ్చాక బుడగలు మాయమైపోయి ఆ గుండీ బరువు మళ్లా దాన్ని కిందకి తీసుకుపోతుంది. ఇలా గుండీ కిందకీ పైకీ ఎంతసేపు తిరుగుతుందంటే.. ఆ నీటిలో కార్బన్‌డయాక్సైడ్ వున్నంత వరకు. ఇలా గుండీనే కాదు. చిన్న చిన్న వస్తువులు వేటినైనా వేయవచ్చు. మరి చేస్తారా ఈ మేజిక్.

చిన్నారి చిత్రకారులు

గాదంశెట్టి బాబి సురేష్‌కుమార్, 7వ తరగతి, చల్లపల్లి పబ్లిక్ స్కూల్, చల్లపల్లి.

ఎస్.శ్రీకాంత్, 9వ తరగతి, జడ్.పి.ఎస్.ఎస్. బెజ్జూర్.

యస్‌కె.అజ్మత్‌అలీ, 7వతరగతి, జడ్.పి.ఎస్.ఎస్., కారేపల్లి, ఖమ్మం.

ఎ.రమాదేవి, 8వతరగతి, ప్రగతి విద్యానికేతన్, సరపక, ఖమ్మం.

గమ్యం చేరేదెవరో!



కలంస్నేహం

పేరు: దొడ్డి బాలకృష్ణ,
వయసు : 16 సం॥
చదువు :10 వతరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం,టీవీ చూడడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : దొడ్డి బాలకృష్ణ, సన్నాఫ్ వెంకటరెడ్డి, వేలంవీధి, గవరపాలెం, అనకాపల్లి.

...జి.రాం[శీగౌతమ్,
...సు :13 సం॥
...వు :9 వతరగతి
...లు: క్రికెట్ ఆడడం, చెస్ ...డం, స్టాంపులు సేకరించడం.
... చిరునామా :జి.రాంశ్రీగౌతమ్, ...ఫ్ జి.బాలరంగయ్య, ఇం.నెం: ...85, సాయినగర్ కాలనీ, వనపర్తి, ...బూబ్‌నగర్- 509103.



క్విజ్ 60 జవాబులు

1.హొయాంగుహో 2. క్రేరళ 3. ...ర్లవెంటుకు 4. నరోజినీనాయుడు ... అభివృద్ధికి 6. 180 డిగ్రీలు 7. ఇంపాల్ 8. ...త్యక్ష ప్రజాస్వామ్యం 9. డ్రిల్లు యంత్రము ...ఆంగ్‌సాంగ్‌సూకీ

క్విజ్ 59కి సరైన సమాధానాలు రాసిన వారు :

యు.పుల్లారావు, 9వ తరగతి, **జి.వెంకటేశ్వర్లు**, 9వ తరగతి, **వి.యేసేబు**, 9వ తరగతి, జిహెచ్‌హైస్కూల్, యర్రగొండపాలెం, ప్రకాశం. **కాలువ శ్రీఅనూహ్య**, 4వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **పెంటకోట అమర్ జయసింహ**, గవరపాలెం, విశాఖ. **ఎస్.జమునారాణి**, 10వ తరగతి, లక్ష్మినగర్, మెదక్. **ఎక్స్. అంబేద్కర్**,6వ తరగతి, బాపట్ల.

ఈ పతాకం ఎవరిది?



ఎరుపు, నీలం, ఎరుపు నిలువు చారలు. మొదటి చారలో ప్రత్యేక గుర్తు. ఇది ఏ దేశపు పతాకం?

భాష చేసిన మేలు

ఒక పేద రైతు కష్టపడి పనిచేసి కొంత డబ్బు పోగు చేశాడు. ఆ డబ్బుతో కొడుకు సోమును బడికి పంపాడు. మొదటి సంవత్సరం బడి అయిపోయింది. సెలవలు ఇచ్చారు. సోము ఇంటికి వచ్చాడు. వాళ్ల నాన్న ఎంతో ఆతృతతో 'ఈ ఏడు ఏం చదువుకున్నావురా?' అని అడిగాడు. దానికి సోము 'కుక్క భాష నేర్చుకున్నాను నాన్నా' అని చెప్పాడు. ఈ జవాబుతో రైతుకు కోపం వచ్చి 'ఇక చదువు మానేసి పని చేసుకో' అన్నాడు. సోము తండ్రిని బతిమిలాడి మళ్లీ బడిలో చేరాడు. రెండో సంవత్సరం అయిపోయాక మళ్లీ బడికి సెలవులిచ్చారు. సోము ఇంటికి వచ్చాడు. అప్పుడుకూడా తండ్రి ఎంతో ఆసక్తిగా 'ఈ సంవత్సరం ఏం నేర్చుకున్నావ్‌రా' అని అడిగాడు. 'కప్ప భాష' అని చెప్పాడు. తండ్రికి కోపం వచ్చి ఇంటినుంచి గెంటేశాడు.

సోము అలా వెళుతుంటాడు. రోడ్డుమీద రెండు కుక్కలు మాట్లాడుకుంటూ వుంటాయి. బులుగు రంగు డాబాలో వుండే వ్యాపారి ఇంట్లో దొంగలు పడతారని అతనికి తెలుస్తుంది. వెంటనే వ్యాపారికి ఈ విషయం తెలియచేస్తాడు. అతను భటుల సాయంతో దొంగల్ని పట్టుకుని జైల్లో పెట్టిస్తాడు. ఇదంతా ముందుగానే తెలుసుకుని తనకుచెప్పినందుకు సోముకు కొంత ధనం ఇస్తాడు ఆ వ్యాపారి. తర్వాత మళ్లీ

గమ్యంలేని ప్రయాణం మొదలెడతాడు సోము. అలా వెళ్తుండగా ఆ ఊరి రాజుగారి దివాణంలో దొంగలుపడి బంగారు నాణాలు దొంగిలించారని తెలుస్తుంది. వారిని ఎలాగైనా పట్టుకోవాలనుకుంటాడు సోము. ఒక బావి దగ్గర మంచినీళ్లు తాగి సేద తీర్చుకుంటూ వుంటాడు. అప్పుడు బావిలోని రెండు కప్పలు మాట్లాడుకోవడం వింటాడు. వాటి మాటలను బట్టి దొంగలు రాజుగారి దివాణంలో కాజేసిన బంగారు నాణాలను ఆ బావిలోనే వేసినట్టు తెలుస్తుంది. వెంటనే అది రాజుగారికి చెప్తాడు సోము. భటులు వచ్చి ఆ సొమ్మంతా దివాణానికి చేరుస్తారు. అప్పుడు రాజుగారు సోముని ఘనంగా సత్కరిస్తాడు. ఇదంతా పేదరైతుకి తెలుస్తుంది. అప్పుడు తన కొడుకు గొప్పతనాన్ని అర్థం చేసుకుని ఇంటికి పిలిపించుకుంటాడు.

జి.రాంశ్రీగౌతమ్, 8వ తరగతి, అనూస్ అకాడమీ, వనపర్తి, మహబూబ్‌నగర్.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	లము
	గము
	పం
	ననము
	టాయువు
	రుగు

గతవారం జవాబులు

రా	ణి
	జు
	శి
	కాసి
	గి
	యి

స్వామి వారు సతీ సమేతంగా కండ్లు మిరుమిట్లు గొలిపేలా... బ్యాగ్రౌండు మ్యూజిక్కుతో హైటెక్ లెవల్లో ఆ రాత్రి - ఆ గుళ్ళో ప్రత్యక్షం కావడంతో జక్కులోడు అదిరిపోయాడు. కండ్లు నలుపుకుని, చేతులు జోడించి అవాక్కయ్యాడు. అర్థరాత్రి... తాను రాత్రి గుళ్ళో పేకాట తర్వాత కండ్లు మగత గమ్మి కాళ్ళు జాపినట్లుంది - అదృష్టం... స్వామి (సతీసమేతంగా) కనిపించినాడు కాబట్టి ఇక తన కష్ట నష్టాలన్నీ చెప్పుకోవచ్చు. ఒకటో రెండో వరాలు తన మొహాన పారేస్తే అంతే చాలు... తన దరిద్రం పూర్తిగా పోకపోయినా... కొంత నయం!

✻ రుక్మిణి

"వరాల జల్లు - పంచెకు చిల్లు"

"భక్తా.. బక్క జక్కులోడా... నీకేం వరం కావాలో కోరుకో...!" అని స్వామి అనడంతో... జక్కులోడికి మూర్ఛవచ్చినంత పనయ్యింది - తానింకా ఏ భజనలో... చిందులో వేసి ప్రసన్నం చేసుకోవాలేమో అనుకున్నాడు. అసలు స్వాములోళ్ళందరూ ఇట్లాంటి బాపతే అయితే బాగు... బాగు...!

"భక్తా... బక్క జక్కులోడా... నీ బాధ నాకర్థమైంది. నీ సందేహానికి చివర్లో.. మాయం అయ్యేపుడు... అందాకా అర్జంటుగా నీకేం కావాలో నువ్వు తేల్చుకునే లోపు - నేనే తేల్చి నీ సమస్యలకు తగిన వరాల జల్లు కురిపిస్తా...

జక్కులోడికి చిందులు తొక్కాలనిపించింది. జుట్టు పీక్కోవాలనీ... ఇంకా...

"నీ పిల్లలంతా బాగే గదా... నీ భార్య ఆరోగ్యం... మంచి డాక్టరుకు చూపించు. అందులోనూ కడుపుతో వుందాయె! ఇదుగో రేపు ఆ ఆడపిల్ల పుట్టంగానే ఆటోమాటిక్‌గా యాభైవేలు దాని పేర్న బ్యాంకులో చేరి పోతాయి - అన్నట్టు స్కూలు కెళుతున్న రెండో పిల్ల... అదే... దానికి సైకిలోటి.. కొత్తది... కొత్త మోడల్... పాపం... ఆడకూతురు బడికి నడిచే వెళుతుందాయె! అన్నట్లు దానికి డ్రస్సూ... పుస్తకాల పైసలు మేమే ఇస్తాం... ఫీజులు మాఫీ...

జక్కులోడు తన్మయంగా రెండు చిందులేశాడు. స్వామివారి సతీమణి స్వామిని చేత్తో డొక్కలో పొడిచింది. కళ్ళతో సైగ చేసింది.. అవతల కుబేరుల వారు... ఆంక్షలు... జాగ్రత్త" అంది.

"అన్నట్లు జక్కులోడా... నీ భార్య వంటకు... డాక్రా మహిళ గదా..."

"చిత్తం... చిత్తం... గాసు బండా పొయ్యా వున్నయయ్యా?"

"టట్... మరో రెండు బండలు.. ఎందుకైనా మంచిది... వెంటనే ఎత్తుకునిపో"

జక్కులోడు మరో రెండు చిందులేశాడు... అన్నట్టు ఒరే జక్కులోడా... నీ పూరిగుడిసె కప్పూ... టాపారం లేచిపోయి చాన్నాళ్ళయింది గదా! వెంటనే నీకో పక్కా ఇల్లు... దాని పక్కనే నీ భార్య గారికో చక్కని ఇల్లు... కట్టేసుకోండి"

మళ్లా సతిగారు స్వామి డొక్కలో ఓ పోటు పొడిచింది." కుబేరుల వారు... అనుమతీ!" అంది.

చిందులాపి జక్కులోడు ఆబగా చూశాడు.. వాడి రెండెకరాల పొలం రెండేండ్ల నుండీ ఎండిపోతూనే వుందాయె!

"ఒరి జక్కూ...నీ పొలానికి నీళ్ళు కావాలె... మీ ఊరి వరకే ఒక సాగునీటి ప్రాజెక్టు కట్టి పారేస్తే ఎట్లా వుంటాందీ... కాలవల నిండా నీళ్ళు... పచ్చని పొలాలు.... ఇంటినిండా పంట... ఒంటినిండా బంగారం... గలగలా కృష్ణమ్మ... బిరబిరా గోదారి...

డొక్కలో పోటు పడ్డా స్వామి ఉద్రేకం ఆగలేదు... సతిగారు చురచుర చూసి మూతి మూడు వంకర్లు తిప్పింది. "ఓసారి ముందూ వెనకా చూసుకోండి స్వామీ" అని గొణిగింది.

"ఎరువులు... పురుగుల మందులు ఫ్రీ... ఎన్ని బస్తాలు... డబ్బీలు కావాలంటే అన్నీ... కొట్టుకోకుండా కొట్టుకోండి...

"పాహిమాం... స్వామీ... అబ్బో... మరి మంచినీళ్ళు... నీటి సంగతో"... జక్కులోడు గొణగడంతో స్వామి ఒక్కసారే రెచ్చిపోయాడు.

"ఇంటికోబోరు... బారెడుకో పంపు... అసలు ఇంటికి రెండు కక్కోసుదొడ్లు... ఆడా మగా వేర్వేరుగా... పోరగాండ్లందరికీ తలో మూత్రశాల...

ఎగిరీ ఎగిరీ జక్కులోడికి కడుపులో దేవినట్లయి కాస్తంత స్థిమిత పడ్డాడు. నీకు నెలకు, చేతి కర్చుకు అయిదువందలు.. మీ అమ్మ... ముస్లిల్దానికి సుట్టలకు... వాటికీ ఆరొందలు పించను.. ఠంచనుగా...

జక్కులోడికి ఒళ్ళంతా గాల్లో తేలినట్లయితే - మూర్ఛపోయే తీరిక లేకుండా మిర్రిమిర్రి చూస్తున్నాడు.

"సర్లేరే... నీ పెద్ద పిల్ల పెళ్ళికి తాళిబొట్టు... వెండి మెట్టెలు... పీతాంబరం అన్నీ ఫ్రీ.... నీకేం భయం లేదు - దీనికి మాంచి మొగుడ్ని చూడు... వాడి సంగతి కూడా నేనే చూసుకుంటా... ఒరే... నీ పెళ్ళానిగ్గానీ కావాలని మనసుబడితే మరో సెట్టు మంగళసూత్రం దానికీ...

సతిగారు అడ్డుపడి కాస్తంత గట్టిగా అరిచినట్లుగానే అంది.

"స్వామివారూ.. ఆగండి.. ముందు చూస్తేనే మీ పటారం... పూలహారం... వెనక మీ పంచె చూసుకోండి - లేకపోతే చేత్తో సర్దుకోండి - పాతబడి చిల్లులుపడి చిరిగి పర్రెబూసింది - లొటారం! దాన్ని కొనుక్కోడానికి మీకే దిక్కు లేదాయె... బడాయి...

అట్లా సతిగారు పతి దేవున్ని నిలదీస్తుండడంతో - విభ్రాంతుడై జక్కులోడు హాహాకారం చేస్తూ దబ్బున కిందబడిపోయాడు.. కలచెదిరింది!

* * *

"అబ్బా... హమ్మా... అదిరా కల... మంచం మీద నుండి పడ్డానా... నడ్డి విరిగినంత పనయ్యింది." జక్కులోడి భార్య వాడికి కాపడంపెడుతుంది.

"ఒరే జక్కులోడా... నీ కలంతా కరక్టేరా... మొన్న తిరపతి మహానాడులో మన చంద్రబాబుగారు కురిపించాడుగా వరాల జల్లులు... అదీ... దాని దెబ్బే నీ తొంటికి తాకింది"

"హా.... హా...?"

"మన బాబుగారుకూడా ఎలచ్చన్లు వస్తున్నాయి గదా... అందుకే అన్ని వరాలు... అవతల అప్పులు పెరిగి ఖజానా ఖాళీ అయితే దిక్కులేదు. వడ్డీ కట్టలేక నడ్డి జారిపోతుంది...

"హేం" జక్కులోడు నేలమీద నిగడదన్ని విరుచుకుపడిపోయాడు. ◆

తల్లీ! వందనం!

* లక్ష్మి

కాలికో, వేలికో ఎక్కడో చోట చిన్న దెబ్బ కూడా తగలని మనిషంటూ ఈ భూలోకంలో లేడుగాక లేడని గట్టిగానే చెప్పచ్చు. అతను రాజుకుమారుడు కావచ్చు. రాళ్ళు కొట్టే కూలీ మనిషి కావచ్చు. దెబ్బలకి ఆ తేడాలుండవు! ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో చోట ఎంతటి వాడికైనా దెబ్బ తగుల్తూనే ఉంటుంది. ఇది లోక థియరీ. యువరాజు గనక వారిని ముట్టుకోకూడదనీ, కూలి వాడు గనక ఇతన్ని పచ్చడి చేయవచ్చునీ దెబ్బల శాస్త్రంలో ఎక్కడా రాయలేదు! ఆ మాటకొస్తే దెబ్బలకి మంచీమర్యాదలుండవు. ముందూ వెనకా చూడవు. వంశవృక్షాలు తిరగెయ్యవు. ఒకటిచ్చుకోవాలనుకుంటే ఇచ్చుకోడమే దెబ్బల డ్యూటీ...!

ఈ దెబ్బల థియరీని అవతల పెట్టండి. నేను కావచ్చు. మీరు కావచ్చు. దెబ్బ తగిలిన మనిషెవరైనా - దెబ్బ తగిలిన తక్షణమే అమ్మా అని అమ్మని మాత్రమే తలుచుకోడం - మన అనుభవంతో సహా ఎందర్నో చూసి వుంటాం! అంతేగాని - దెబ్బ తగలగానే నాన్నా అనిగానీ మేనమామా అని గానీ అనలేం. అమ్మముందు ఏ బంధువైనా ఎంతటి వాడైనా ఆఫ్టరాలే! అమ్మ తర్వాతే ఎవరైనా! అందువల్ల దెబ్బ తగిలినప్పుడు తల్లి గుర్తుకు రావడం తప్పనిసరి. మనల్ని ఆదుకునే అనురాగమూర్తి అమ్మ! దెబ్బ తగిలినప్పుడు తెలుగు వాళ్ళు మాత్రమే అమ్మా అంటారనీ - నాన్ తెలుగూస్‌కి ఆ సవుండు రాదని లలిత నాతో వాదించింది. లలిత ఎప్పుడూ ఇంతే! సూర్యుడు పడమర దిక్కున ఉదయించును అని చెప్పాలని ప్రయత్నిస్తుంది!

మనం కష్టాల్లో ఇబ్బందుల్లో వున్నప్పుడు నేను నీకు అండగా ఉన్నానుకన్నా అని దూసుకువచ్చే మొదటి వ్యక్తి తల్లి! అల్లాంటి తల్లిని కొట్టీ తిట్టీ కొంపనుంచి తరిమేసిన ఘనాపాటి ఆసాములు కూడా తమకి దెబ్బ తగిలినప్పుడు అమ్మా అని కేవలం అమ్మని మాత్రమే తలుచుకుంటున్నారంటే - అమ్మకున్న స్థానమేమిటో ఈజీగా తెలిసిపోతోంది! అమ్మా అనే పదంలో తియ్యదనం అపారంగా వుంది. ఆ తియ్యదనమే తగిలిన దెబ్బకి దివ్యౌషధమవుతుంది! దేవుడున్నాడో లేదో అనే విషయం చర్చకు రావచ్చు. ఉన్నాడున్నాడని కొందరూ, లేడుగాక లేడని మరికొందరూ వాదులాడుకోవచ్చు. అంతేగాని - అమ్మలేదనే మనిషి ఈ మహిలో లేడు సుమా అన్నారు విజ్ఞులు!

అంచేత దేవుడి కంటే గొప్పది తల్లి! అందుకే దేవుళ్ళ లిస్టులో మాతృదేవోభవ అంటో కన్నతల్లికి ప్రథమ స్థానం అంటగట్టేరు! ఆమె తర్వాతే మిగతా దేవుళ్ళు! తల్లికున్న ఘనమైన విలువ తెలీని మూర్ఖులెవరో తల్లిని తిడతారు. కొడతారు. అల్లాంటి రవుడీలను గట్టిగా శిక్షించాలని కోర్టు వారికి చెబితే - చెప్పిన వారినీ, కోర్టు వారినీ ఆ తల్లి క్షమించదు! మా అబ్బాయికి శిక్ష వేసేందుకు మీరెవరని వారినీ, వీరినీ ఉరికంబమెక్కిస్తుంది! అదీ తల్లి! చెడు తిరుగుళ్ళకు బాగా అలవాటు పడిన బదుద్ధాయి ఒకడు - ఒక వేశ్య వలలో చిక్కుకుపోతాడు. ఏం కావాలో కోరుకో డార్లింగ్ అని ఆ వేశ్యను అడుగుతాడు. బదుద్ధాయికి తల్లి మాత్రమే వుంది. ఆవిడ కన్ను మూస్తే ఆవిడ తాలూకు బోలెడు ఆస్తి బదుద్ధాయికి దక్కుతుంది. తద్వారా తన సొంతమవుతుందనే దురాశతో - మీ అమ్మ గుండెను తెచ్చివ్వమని బదుద్ధాయిని వేశ్య వయ్యారంగా అడుగుతుంది. ఓసింతేగదా అని బదుద్ధాయి తన తల్లిని చంపి - ఆమె గుండెను తీసుకుని వేగంగా పరుగెడుతుంటాడు. భద్రం కొడకా - పరుగెత్తితే పడిపోతావ్! నువ్వు పడిపోడం నే చూళ్లేను. మెల్లిగా నడునాయనా అని ఆ తల్లి గుండె హెచ్చరిస్తుంది!

కొన్నేళ్ళ క్రితం - ఒక మహా దర్శకుడు తన సినీమాలో తల్లిని ఆ విధంగా నిర్వచించి ధన్యుడయ్యేడు! తల్లిగురించి అంత అద్భుతంగా చెప్పిన ఆ మహానుభావుడికి చేతులెత్తి మొక్కాలి. పొత్తిళ్ళలో ఆడుకునే బిడ్డకు ఎప్పుడు ఏమికావాలో ఆ తల్లికి మాత్రమే తెలుస్తుంది! ప్రపంచ భాషలకు అతీతమైన ఆ బిడ్డ భాష ఆ తల్లికే తెలుసు! వాడేదో కిచకిచమంటాడు. పాలు పడుతుంది. వాడికి పాలు కావాలని నీకెట్లా తెలిసిందని అడిగితే - నా బిడ్డే చెప్పేడంటుంది! వాడి చిట్టి చేతుల్తో తల్లి చెక్కిళ్ళు తాకుతాడు! వరాల తండ్రీ నీ ఆకలి ఇంకా తీరలేదా కన్నా అని అడుగుతుంది. వాడి ప్రతి కదలికలోనూ భాష ఉంది. ప్రతి కేరింతలోనూ భాష ఉంది. అది పసికూన భాష. బహు భాషా పండితులను సైతం విస్మయ పరిచే అద్భుత భాష! కేవలం కన్న తల్లికి మాత్రమే బాగా అర్థమయ్యే అందమైన భాష!

ఆ బిడ్డ పెరిగి పెద్దవాడవుతాడు. పండిత సభల్లో - సభారంజకంగా మాటాడి సెభాషనిపించుకుంటాడు. తల్లి దగ్గిర అతనికి మాటల్తో అవసరం పడదు. అతను చెప్పదలుచుకున్నది చెప్పకుండానే - అక్షరం పొల్లు పోకుండా ఆ తల్లి గ్రహిస్తుంది! నా మాట నీకెట్లా తెలిసిందని అతను అడిగితే - పేగు బంధాలకు మాటతో పని పడదు కన్నా అంటుంది. తన బిడ్డను పూలబాటలో నడిపించేందుకు - ఆ తల్లి ముళ్ళబాటలో నడవడానికి సిద్ధపడుతుంది! జరుగుబాటుకోసం - తల్లినీ, నేల తల్లినీ విడిచిపెట్టి ముంబాయిలో నూలు మిల్లుకు అంకితమైన బిడ్డకోసం - ఆ తల్లి తపన ఎంత తీవ్రంగా ఉంటుందో - తల్లిని అపారంగా ప్రేమించే మహాకవులు అక్షరాల్లో పొదిగేరు! ఏం తిన్నడో బిడ్డ - ఎట్లా గున్నడో బిడ్డ అని తల్లి హృదయాన్ని అక్షరాల్లో తర్జుమా చేసి మన ముందుంచేరు! కన్నబిడ్డ క్షేమం కోసమే తల్లి కడుపు మాడ్చుకుని గాలి పీల్చుకుంటో బతుకుతుంది! బిడ్డకు ఇచ్చుకోడంలో ఉన్న తృప్తి తల్లికి మాత్రమే తెలుసు! అంచేత - తల్లికి మించిన దైవం ఇలలో లేదని ఇందుకే అంటారు! ఈ కారణంగానే - ఏ తల్లి దీవెన ఏ సత్ఫలితాన్నిస్తుందో అనూహ్యం గనక - ఆడ మనిషిలో అమ్మను వెతుక్కుని జాగ్రత్త పడమని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ఆడవాళ్లను అల్లరి చేసే చిల్లర వెధవలకు పుట్టగతులుండవని కూడా వారే సెలవిచ్చేరు. అదీ విషయం! ◆

* ఎన్.వి.శేఖర్ బాబు

ప్రాచీన చరిత్రకు ప్రత్యక్ష సాక్షి
పెనుకొండ

కొండపైనున్న ఖిల్లా



శతాబ్దాల క్రితం విజయనగర సామ్రాజ్య వైభవోజ్వల చరిత్రకు ఆనవాలు 'పెనుకొండ'. పురాణాల్లో జీవుల పర్వతంగా ప్రసిద్ధి కెక్కిన పెనుకొండకు 'ఘనాద్రి', 'ఘనగిరి' అని పేర్లు ఉన్నాయి. విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ ఒక మహామండల రాజధానిగా, వేసవి విడిదిగా వుండేది. శిల్పకళా సామ్రాజ్యానికి, శత్రుదుర్భేద్యమైన కట్టడాలకు పెట్టింది పేరు పెనుకొండ. నాటి రాజుల కళాభిమానానికి, శిల్పసౌందర్యానికి నిదర్శనం పెనుకొండలో నేటికీ ఉన్న గిరిదుర్గాలు, కట్టడాలు, శిల్ప కళామందిరాలు, శత్రు దుర్భేద్యమైన కోటగోడ.

"కోటగలిగిన కొండ, కొండగలిగిన కోట, కోటకొండలలోన మేటి ఈ పెనుకొండ" అని మేటి కవులెందరో ప్రస్తుతిరిచారు.

"చనిననాళులు తెనుగు కత్తులు సానబెట్టిన బండ, ఈ పెనుకొండ కొండ. రంధ్రములు ప్రసరించు శతువుల రక్తధారలు తాగి త్రేన్చిన ఆంధ్ర, కన్నడ రాజ్య లక్ష్ముల అందినీలపు దండ ఈ పెనుకొండ కొండ" అని



పట్టణంలో వున్న పెద్దబసవన్న

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ అనేక రీతుల పొగిడారు.

రాక్షసి తంగడి యుద్ధానంతరం ముఖ్యపట్టణంగా పెనుకొండ వున్నట్లు తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో పెనుకొండ రాజధానిగా, వేసవి విడిదిగా వుండేది. పెనుకొండ అలనాటి విజయనగర సామ్రాజ్య వైభవ ప్రాభవాలను చాటుతూ సుందర పట్టణ రాజ్యమై ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం పెనుకొండ అనంతపురం జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా వుంది. కొండలలో అతి పెద్ద కొండ కలిగి వుండటంతో ఈ వూరికి ఘనగిరి (పెద్దకొండ అని అర్థం) అనే పేరు వచ్చింది. అటు తరువాత పెనుకొండ అని నానుడిలోకి వచ్చినట్లు తెలుస్తోంది.

క్రీ.శ. 1320లో వీరభల్లుడు పాలించినట్లు తదనంతరం వనదుర్గాధీశుడు పాలించినట్లు, అటుపిమ్మట 1340లో బుక్కరాయలు జయించినట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1357లో బుక్కరాయల కుమారుడు విరూపణ్ణ, అనంతరం గంగరాజు కొన్నాళ్లు పాలించారు. గంగరాజును ఓడించి శ్రీకృష్ణరాయలు సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఇతని హయాంలోనే పెనుకొండలో అనేక కట్టడాలు, నిర్మాణాలు పూర్తి చేసుకొన్నాయి. కొంతకాలం విజయనగర రాజులకు దుర్భేద్యమైన కోటగా, సామ్రాజ్యానికి అండగా వుంటూ వచ్చింది పెనుకొండ. 1652లో బీజాపూర్ సుల్తానులు సామంతరాజులను కూడగట్టుకొని పెనుకొండను స్వాధీనం చేసుకొని పరిపాలించారు. 1762లో మైసూర్ సుల్తాన్ హైదర్‌వలీ పెనుకొండను కైవసం చేసుకొని పాలిస్తుండగా 1872లో బ్రిటీష్ పాలకులు స్వాధీనం చేసుకొన్నారు. అంతటితో పెనుకొండ కేంద్రంగా రాజుల పాలన ముగిసింది. శ్రీకృష్ణదేవరాయల వేసవి విడిది భవనమైన 'గగన మహల్'ను బ్రిటిష్ పాలకులు 'ప్రముఖ న్యాయస్థాన భవనంగా' వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. పెనుకొండలో గత వైభవాన్ని గుర్తు చేసే ఎన్నో కట్టడాలు, నిర్మాణాలు నేటికీ కన్పిస్తున్నాయి. వాటిలో రామబురుజు, లక్ష్మణ బురుజు, గాలిగోపురం, ఉయ్యాల గోపురం, తిమ్మరుసు సమాధి, నాణేల ముద్రణా మందిరం, గగనమహల్ కొండపై గల ఖిల్లా, జైనదేవాలయాలు, హిందూ దేవాలయాలు, ముస్లింలకు మసీదులు, పట్టణానికి నలువైపుల నిర్మితమైన కోటగోడ, బురుజుల కట్టడాలపై శాసనాలు, చిత్రాలు గత వైభవాన్ని నేటికీ చాటుతున్నాయి.

పెనుకొండ పట్టణంలో వున్నన్ని దేవాలయాలు రాష్ట్రంలో మరే గ్రామంలో వుండవని తెలుస్తోంది. అంతేకాక విజయనగర రాజుల కాలంలో పెనుకొండలో సర్వమత ఆదరణ కల్పించబడిందనడానికి పట్టణంలో వున్న విభిన్న మతాల దేవాలయాలు, మసీదులు, చర్చ్ అందుకు నిదర్శనం. భిన్న సంస్కృతికి అద్దం పట్టే కళలకు ఇక్కడ కొదవలేదు. పట్టణంలో 365 దేవాలయాలు నిర్మితమయ్యాయని చరిత్ర చెబుతోంది. వీటిలో అధిక భాగం శ్రీఆంజనేయస్వామి దేవాలయాలు అధికంగా వున్నాయి. పట్టణంలోని శ్రీరామభద్రాలయం, శివాలయం, త్రిముక్తేశ్వరస్వామి దేవాలయాల్లో రామాయణం, భాగవత కథలను తెలిపే శిల్పాలు నిర్మితమవడం విశేషం. ఇక్కడి కన్యకాపరమేశ్వరి దేవాలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. పట్టణంలోని పులేగమ్మ, కాళమ్మ, ఉజ్జయినీ మాంకాళమ్మ దేవాలయాలు, శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయాలు, ఊరువాకిలి ఆంజనేయస్వామి దేవాలయం. ఎంతో ప్రసిద్ధి చెందాయి. ప్రతి దేవాలయానికి ఒక్కో విశిష్టత, ప్రత్యేకత వుంది. వీటికితోడు బాబయ్యస్వామి దర్గా, షేర్‌ఖాన్ మసీదు, బౌద్ధుల పచ్చపార్శ్వనాథస్వామి దేవాలయం దేశంలోనే ప్రసిద్ధి చెందాయి. శ్రీకృష్ణదేవరాయలు రోజుకొక దేవాలయ దర్శనం చేసుకొనే వారని 365 దేవాలయాలకు సంవత్సరానికోసారి ఈ మేరకు వచ్చి పూజలు నిర్వహించేవారని తెలుస్తోంది. పట్టణంలో దేవాలయాలే కాక తాగు, సాగునీటి అవసరాలకై రాజులు ఎంతో శ్రమకోర్చి నిర్మించిన అతి పెద్ద బావులు 30 దాకా వున్నాయి. వీటిలో పసురెక్కడి బావి, పాలక్కరి బావి, సత్రం బావి, ఫక్రుద్దీన్ బావి, అక్కమ్మదార్ల బావులు ప్రముఖమైనవి. వీటిలో ఎంతటి కరువు ఎదురైనా సరే నీరు లేకుండా ఎండిపోవడం అంటూ ఇంతవరకు జరగలేదని పెద్దలు అంటుంటారు.

పట్టణ సమీపంలోని ఆనాడు తటాకం నిర్మించారు. అప్పటిలో అంతఃపుర స్త్రీలు జలక్రీడలు ఆడేందుకు సరోవరంగా వుండేదని, ఇప్పటికీ అది భోగసముద్రం పేరిట చెరువుగా వుంటోంది. పెనుకొండ పట్టణంలోని కొన్ని దేవాలయాల్లో మాత్రమే పూజలు జరుగుతున్నాయి. కొండపైనున్న నరసింహస్వామి దేవాలయ భూమి అన్యాక్రాంత్రం కావడంతో, పట్టణంలోని అన్ని దేవాలయాలకున్న భూములు కూడా కొందరి చెప్పు చేతుల్లో వుండి దేవాలయాలకు ఆదరణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పెనుకొండను పర్యాటక కేంద్రంగా గుర్తించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ◆

*సునీల్ కుమార్



గ్రామీణ ప్రతిభను గుర్తించరా?

వంద కోట్ల జనాభా కలిగి ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణ పతకం కూడా సాధించలేకపోయింది. లోపం ఎక్కడుంది? భారత్‌లో ప్రతిభ గల క్రీడాకారులు లేకపోవడం కారణమా? అయితే మనకంటే తక్కువ జనాభా కలిగిన జపాన్, ఆస్ట్రేలియా, వియత్నాం, క్యూబా వంటి దేశాలు ఒలింపిక్స్‌లో స్వర్ణాల పంట పండిస్తున్నాయి. మరి మన దేశం ఎందుకు వెనకబడి పోతోంది. దేశంలో ప్రతిభ గల ఆటగాళ్లకు కొదువలేదు. అయితే ఆ ప్రతిభావంతులను వెలికితీయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానమే ప్రధాన కారణం.

స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడం వల్లే గ్రామీణ ప్రాంతాల్లో గల ఆణిముత్యాల ప్రతిభ ప్రపంచానికి చాటలేకపోతున్నాం. శాయ్, శాప్ తరఫున నియమితులైన అధికారులు, కోచ్‌లు శిక్షణా శిబిరాలను పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయడం వల్ల గ్రామీణ ప్రాంత ఆటగాళ్లు వెలుగులోకి రాలేకపోతున్నారు. పటిష్ట యంత్రాంగాలను రూపొందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో గల పాఠశాల విద్యార్థుల్లో చిన్నప్పటి నుండే క్రీడల పట్ల ఆసక్తి పెరిగేట్లు కృషి చేయవచ్చు.

పాఠశాల స్థాయిలోనే గుర్తించాలి

పాఠశాలల్లో వ్యాయామ విద్య ద్వారా ఆటగాళ్లను తయారు చేయాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులది. ప్రతి పాఠశాలలో వ్యాయామ విద్య తప్పనిసరి అని ప్రభుత్వం రూపొందించిన నిబంధనల్లో స్పష్టం చేసింది. కానీ ఆచరణలో మాత్రం ఆ ఛాయలేవీ మచ్చుకైనా కనిపించడం లేదు. విద్యార్థులకు క్రీడల్లో ప్రాథమిక మెళకువలు నేర్పేది వ్యాయామ ఉపాధ్యాయులే. వారు విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఆటలపై ఆసక్తి పెరిగేట్లు చేయాలి. పిల్లలు విద్యలో రాణించాలంటే వారికి చదువుతో పాటు శారీరక వ్యాయామం కూడా అవసరం. ఏ విద్యార్థి ఏ క్రీడకు సరిపోతాడో ఎంపికచేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఆయా క్రీడల్లో స్పెషలిస్టులుగా తీర్చిదిద్దవచ్చు. దీనికి మండల స్థాయి మొదలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహించాలి. అయితే ప్రస్తుతం మండల స్థాయిలో శిక్షణా శిబిరం మచ్చుకు ఒకటైనా లేదు. జిల్లా స్థాయిలో ఉన్న ఏకైక శిక్షణా శిబిరాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. జాతీయ క్రీడలకు, అంతర్జాతీయ టోర్నమెంట్లకు అట్టహాసంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం క్రీడాకారులను తయారు చేసుకోవడానికి అవసరమైన గ్రామీణ స్థాయి శిక్షణా శిబిరాల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. గెలిచిన తర్వాత బహుమతులు ఇవ్వడం కాదు, గెలుపుకు సన్నద్ధం చేయడమే సరైన ప్రోత్సాహం అని పలు సన్మాన సభల్లో పలువురు క్రీడాకారులు చెప్పారు. అయినా ప్రభుత్వం మేల్కోనలేదు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించి ఆసక్తి, సమర్థత కలిగిన ఆటగాళ్లను ఎంపికచేయాలి. కానీ ఆ సూచనలు మచ్చుకైనా కనిపించడం లేదు. ఆటల్లో ప్రావీణ్యం కనబరుస్తున్న చిన్నారులకు ఆధునిక శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ప్రావీణ్యతను మరింత పెంచవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేసిందని ముఖ్యమంత్రితో సహా పలువురు మంత్రులు జాతీయ క్రీడల సందర్భంగా పలుసార్లు చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. ఆటగాళ్ళకు అంతర్జాతీయ ప్రమాణాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా 32వ జాతీయ క్రీడలకు సంవత్సరం క్రితం నుండే సన్నద్ధమవుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. తీరా పోటీలు ప్రారంభమయ్యే నాటికి ఇతర రాష్ట్రాల నుండి ఆటగాళ్లను దిగుమతి చేసుకొని మన రాష్ట్రానికి పతకాల పట్టికలో అగ్రస్థానం వచ్చినట్లు చూపించారు. ఎలాగైతేనేం అత్యధిక పతకాలు సాధించామని సంతోషిస్తున్న సమయంలో గెలుపొందిన ఆటగాళ్లు డోపింగ్ పరీక్షలో పట్టుబడడంతో ఆ ప్రయోగం కూడా ఎదురు తన్నింది. దీనంతటికీ ప్రధాన కారణం పతకాల కోసం పటిష్టమైన వ్యూహాన్ని రూపొందించుకోవడంలో జరిగిన వైఫల్యమే.

ఉన్న స్టేడియాలకు మరమ్మతు చేయాలి

రాష్ట్రంలో ప్రతి మండలంలో ఒక స్టేడియం నిర్మిస్తామని క్రీడా మంత్రి పి.రాములు చేసిన వాగ్దానం నీటిమూటగానే మిగిలిపోయింది. అయితే కొత్త స్టేడియాలను నిర్మించే బదులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆదరణకు నోచుకోని వందలాది స్టేడియాలకు ముందు మరమ్మతు చేయాలని క్రీడాకారులు, అభిమానులు కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన స్టేడియాలలో కనీస సౌకర్యాలు కల్పిస్తే అదే చాలునని పలువురు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కోచ్‌లు కూడా జిల్లా కేంద్రాలకే పరిమితమవుతున్నారు. కొంతమంది కోచ్‌లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో క్యాంపులు నిర్వహించేట్లు చేయాలి. పాఠశాల విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ లాగా స్పోర్ట్స్‌కు కూడా ప్రత్యేక శిక్షణా శిబిరాలను నిర్వహించాలి. ◆

ఆటలకూ అర్హత మార్కులు నిర్ణయించాలి

ప్రతి ఒక్క పాఠశాలకు శాప్ కిట్‌లను సరఫరా చేయాలి. పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను జిల్లా స్థాయికి, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలి. ఆ సౌకర్యం ప్రస్తుతం లేదు. పరీక్షల్లో అన్ని సబ్జెక్టులతో పాటు స్పోర్ట్స్‌ను కూడా మరో సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టాలి. ఆ సబ్జెక్ట్‌లో కనీస అర్హత మార్కులు నిర్ణయించాలి. అప్పుడే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాయామం, క్రీడల ప్రాముఖ్యత గురించి సెమినార్‌లు నిర్వహించాలి. అప్పుడు క్రీడలపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోతాయి.

ఎం. సంతోష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మౌలాలి, హైదరాబాద్.

క్రమం తప్పకుండా పోటీలు నిర్వహించాలి

మాకు పాఠశాలల్లో చదువు తప్ప ఆటల ప్రాముఖ్యతను చెప్పడం లేదు. ఆడుకోవడం టైం వేస్ట్ అనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో, ఉపాధ్యాయుల్లో ఉంది. అది ముందు పోవాలి. మాకు ఇష్టం ఉన్న ఆటలో ప్రోత్సహించే వారే లేరు. మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో క్రమం తప్పకుండా పోటీలు నిర్వహిస్తే ప్రతిభ గల ఆటగాళ్లు వెలుగులోకి వస్తారు. మాలో లోపాలుంటే ట్రెయినింగ్ సెంటర్లు పెట్టి సవరించాలి. అప్పుడే మేం చదువుతో పాటు ఆటల పట్ల కూడా ఆసక్తిని పెంచుకుంటాం.

విజయ్, విద్యార్థి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలేరు, నల్లగొండ జిల్లా.



✻ టి.రాంరెడ్డి

(గతవారం తరువాయి) బంజర ఆంధ్రప్రదేశంలోని అనగనగా ఒక జిల్లాలోని ఒకానొక కుగ్రామం - గ్రామమనగా అచ్చట అన్ని వర్గముల ప్రజలుందురు. కొన్ని పొలములు... తోటలు వృక్షములతో అలరారుచుండును. కొన్ని బావులుండును- వాటికి కరంటు మోటార్లు... మీటర్లుండును... స్విచ్చి నొక్కినచో నీరు వచ్చును. ఊరి చెరువు కింద కూడా రైతులు వ్యవసాయము చేయుదురు. పంటలు పండించెదరు. గ్రామమలో వివిధ వివిధ వృత్తుల వారుందురు. వారు తమ వృత్తి ధర్మమును పాటించి శ్రమ చేసి జీవించెదరు. చదువుకున్న... కుంటున్న యువకులు కూడా వుందురు. అన్ని వర్ణముల వారుందురు - అట్టడుగు వర్గాల వారుందురు...

జీవకారుణ్యారణ్యం

బంజర గ్రామములో పైన చెప్పిన 'గత చరిత్ర' అంతా పాతరాతి యుగం నాటిది కావచ్చు! కాలం, కంప్యూటరు రెండూ పోటీపడి కదులుతున్న కాలం కలిగించే మార్పులూ... కొన్ని చేర్పులూ.. చూడకుండా వుండలేము.

"వామ్మో... గీ కరంటు బిల్లు కట్టడానికి ఎడ్లూ.... గొడ్లూ అమ్మినా తీర్దు నాయనో.... మీటర్లు పీకి పారేయండ్రి... ఆవదం దీపాలు ఎలిగిచ్చుకుంటెపాయె!" మొత్తానికి మొత్తం ఊర్లె సగం ఇండ్లువాళ్ళు అట్లా పీక్కునే బాధ లేకుండా ట్రాన్స్కో వాళ్ళే వైర్లూ అవీ పీకిపారేయటంతో అందరూ హాయిగా వూపిర్లు తీసుకున్నారు.

వివిధ కులాలు... వృత్తులు... చేసుకునే వాండ్లు గోళ్ళు గిల్లుకుని లాభం లేదనుకుని పనుల్లేక పస్తులకు అలవాటు పడిపోతున్నారు!

రైతుల సంగతి సరేసరి! చెరువులు మేటేసి నీరంతా అయిపోవడంతో ఎండి నెర్రెలు బాసిన, పొలాలు... బావుల్లో అడుగంటిన నీళ్ళు.. కళ్ళల్లో ఇంకిపోయిన కన్నీళ్ళు... ఇంట్లో గింజా - గిరువూ లేక చేతికి ఏది దొరికితే అది అమ్మి కాలం వెళ్ళదీసే పనిలో పడ్డారు.

కూలినాలి జనం మూటాముల్లె సర్దుకుని బసో... రెయిలో ఎక్కి పట్నాలవేపు పరుగులు తీశారు. అంతా నిస్సారంగా... బిత్తరంగా... భీకరంగా వుంది. విచిత్రం ఏమిటంటే అక్కడక్కడ ఇళ్ళలో టీవీల్లో మాత్రం మాంచి పచ్చని పొలాలు... జాతీయ క్రీడల పసిడి పతకాల పంట...నోరూరించే ఉపన్యాసాలు వినబడుతూనే వున్నాయి.

"ఏందో... దేశంలోని నదులన్నీ ఒకటి చేసి పారేస్తే మనకేం ఢోకాలేదు" ముసలి గురవయ్య నిట్టూర్చాడు. ఊరిబయట వెంకటరెడ్డి మోట బావిలోనే నీరు... ఊరంతా వంతుల వారీగా అక్కడ నుండే తెచ్చుకోవాలి! భయం వల్ల విచిత్రంగా ఎవడు నీళ్ళు తెచ్చుకున్నా అంటూ సొంటూ గురించి అరిచేవాడే కనిపించడం లేదు. ఆకలివల్ల కాబోలు.. అంటరానితనం గురించి మాట్లాడుకుని కాట్లాడుకునే ఓపిక తగ్గిపోయింది... ఓపికుంటే పదిమంది చేరి నీళ్ళ గురించీ... కరంటు దెబ్బ గురించీ... గవర్నమెంటును శాపనార్థాలు పెట్టడంలో పెద్ద భిన్నాభిప్రాయం లేదు.

ఇదంతా ఒక ఎత్తు. ఎరుకల కొండలు ఊరికి ఆనుకునే వున్నాయి. దరిద్రం వీళ్ళకు జన్మతః వచ్చింది కాబట్టి వీళ్ళకేం పెద్ద 'భయం' అనిపించడం లేదు. అయితే ఈ సందులోనే 'ఎల్లిగాడు' ముందుగా ఒక కిటుకు కనిపెట్టి ఆచరణలో పెట్టాడు. పొలాల్లోనే ఎండ్రకాయ బొరియల్లో చేయినూకితే వాటమైన ఎలుకలు దొరుకుతాయి. వాటినిగానీ తెచ్చి మంటలో మాడ్చుకుని, ఉప్పు కారం వేసి కూరవుడకబెట్టి తింటే కడుపు నిండిపోద్ది!

ఇక-పైన ఎండా - ఒంటికోగోచీ... చేతుల గుడ్డనంచీ... ఎండిన పెదాలు... నిండని డొక్కలెగరేసుకుంటూ పోరగాండ్లు కూడా ఈ విద్యలోకి జొరబడిపోయారు. ఎందుకంటే వీటిని ఎవరికంటబడకుండా కొందరు సూద్రులు కూడా రహస్యంగా తింటానికి ఎగబడిపోతున్నారు. రెండుసార్లు మాత్రం ఎలకల కోసం బొక్కలో చెయ్యి నూకినపుడు మంటమీదున్న మెుండి తాచోసారి... పొడల పింజరపావోసారి పట్టి పీకడంతో ఒకడు నరగలు గక్కి అక్కడే నిక్కినీలిగాడు. పింజరోడు మాత్రం వళ్ళంతా రక్తం మరకలు గట్టి.... ఎక్కడికక్కడ వాచిపోయి కదల్లేక మూలుగుతూ వుండిపోయాడు!

ఆ రోజు ఎరుకల ఎల్లిగాడి గిరాకీ బాగా తగిలింది. పొద్దున్నే ఒక బొక్కలో చెయి నూకితే మాంచి నీటిపాము లగాయించి చేతికి చుట్టుకుని బయటకు వచ్చింది - "ఛు..." అని చీదరగా బూతులు తిట్టి దాన్ని నేలక్కొట్టి చంపిపారేశాడు. బారెడు పైనే వుంది! రెండు మూడు కాట్లు పీకినా.. మంట మండిందేగానీ... తుడుచుకుంటే పోయింది. అట్లావాడు మధ్యాహ్నానికే పద్దెనిమిది ఎలుకలు పట్టుకున్నాడు. సంచి బరువుగా వుంది.. దాన్ని నంకకు తగిలించుకుని సాయంకాలమపుడు ఇంటిదారి పట్టాడు. దోవలోనే మాదిగ మంగయ్య నాలుగు కొనుక్కుని గుడ్డల చుట్టుకుని గూడెంలోకి పోయాడు!

ఎంకులు గాడి పెండ్లాం పదింటిని ఎర్రగా మంటల్లో కాల్చింది - పోరగాండ్లు రాతెండి బొచ్చెలు పట్టుకుని మంటచుట్టూ గోలగా కూలబడ్డారు - ఎలుకలమ్మిన డబ్బుతో ఓ సీసా గుడుంబా తెచ్చుకుని సగం తాగి - విరక్తిగా పెండ్లాంతోని ముచ్చట్లకు తగులుకున్నాడు.

"పొలాలల్ల గీ ఎలుకలన్ని ఖతం అయినంక వీట్ని పట్టుకోవాల్నంటే.... ఎట్ల గడుసూస్తూ కుప్పొ - తుప్పొలేవాయె! అడవి జంతవే లేకపాయె! ముంగీసలు.. ఎంటవలు మచ్చుకి లేవు... గీ ఎల్కలయినా బూంతల్లి కడుపుల దాక్కోనున్నెగాబట్టి మిగిల్నయి"! ఎల్లిగాడికి భయం పట్టి మరికొంచెం తాగాడు. వాడి పెండ్లానికి భయపడే ఓపిక కూడా ఏనాడో పోయింది. అది వాటిని అటు ఇటు కోసి... సట్టిలోకి ఎక్కించి గింతంత కారం ఉప్పు చల్లి మంట ఎగదోసింది!

"పుట్టినాక ఏదో ఒక్కటి తినకుంటె ఎట్ల... పిల్లులో..." అది పొలమారినట్లు నవ్వి కూర కలబెట్టసాగింది - ఎల్లిగాడు మిగిలిన సారాను రెండు గుక్కల్లో గబగబ తాగాడు. వాడికా సమయంలో అతి గొప్ప ఆలోచన... అమెరికా వాడిక్కూడా కలగనంత

వేగంగా... వింతగా కలిగింది. "నిజవే... ఎలకలన్నీ ఖతం అయితే మనవంతా మటాసుగదా... ఇప్పుడు జనాలు మొత్తం ఊర్లుపట్టి నీళ్ళు లేక... తిండి లేక మలమలమాడిపోతున్నరే... మొత్తానికి మొత్తం మిటుకు మంటే - గుళ్ళన్నిట్లె దేవుళ్ళకు పూజలెవుడు చెయ్యాలె.. ఈ కొబ్బరి కాయలెపుడు కొట్టాలె... దేవుండ్లకు తిప్పలే... అద్సరె... ఈ రోడ్లు... బ్రిడ్జీలు... బిల్డింగులు వీటన్నిట్లె జనాలు లేకపోతే ఏమైపోయేటట్టు! గిన్ని దుకాణాలల్ల గిన్ని రకాల సరుకులు... వాట్ని కొనేదెవడు?" ఈ ప్రశ్నల్తో బాటే వాడికి పెద్ద పెట్టున నవ్వే వచ్చింది.

"అదికాదేస్... ఓట్లు... ఓట్లు అడిగేటోడెవుడు... ఏసేటోడెవడు... ఎవడికెయ్యాలె... ఈ మాటలనుకుంటూ పెండ్లాం మొగుళ్ళిద్దరూ పెళపెళా నవ్వుతున్నపుడే వాడి నల్లటి బక్కచిక్కిన వీపు మీద ఎస్సై మల్రెడ్డిగారి చరుపు పెళ్ళుపెళ్లున పడిపోయింది. జవాన్లు ఎరుకల ఎల్లిగాడ్ని పెడరెక్కలు విరిచి పెట్టి జీపులోకి ఎక్కిస్తుంటే వాడి పెండ్లాం... పోరగాండ్లు గోలకు తగులుకున్నారు.



పోలీసులు సగం కూలిన గుడిసెనంతా కలబడి వెతికారు. ఎక్కడా ఒక్క జీవరాశీ కనిపించక పోవడంతో గార్డు మీద మల్రెడ్డి మండిపడ్డాడు.

"జీవకారుణ్యం... జంతు బలులూ... అరణ్యాలు ఖాళీ అంటివి గదరా రాస్కెల్ - పులీ... నెమలీ... కుందేలు... ఏదిరా?"

గార్డుగారు గడబిడగా కోసి పడేసిన ఎలుక తోకలూ... మంటమీద సట్టీ చూపించడంతో మల్రెడ్డి మందహాసం చేశాడు.

మరో నిమిషంలో ఎరుకల ఎల్లిగాడు అభయారణ్యాలలోని జంతువులను వేటాడి చంపుతున్నందుకున్నూ... వాటితో వ్యాపారం వెలగబెడుతున్నందుకున్నూ అమానుషమైన ఈ వృత్తిని ప్రోత్సహించే 'కుట్ర'కు సారధ్యం వహిస్తున్నందుకున్నూ.. ఉత్తరోత్తరా ఈ వ్యాపారాన్ని రహస్య మార్గాన శత్రుదేశాలతో కూడా ఒప్పందాలు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయనీ... అట్లా రకరకాల సెక్షన్ల కింద లాకప్పులోకి నెట్టబడి కోర్టులో దఖలు పరచబడినాడు ముద్దాయి ఎల్లిగాడు!

* * *

"ముద్దాయి ఎల్లిగాడూ... ము...ద్దాయి ఎ..ల్లి..గాడూ...!" డవాలు వీరసామి పెనుకేకలు పెట్టడం... ఎల్లిగాడు బోనెక్కడం... ప్రమాణం తంతూ జరిగిపోయాయి!

మార్తాండం గారికి పి.పి. మీద మహామంటగా వుంది... అవసరం పడని మాటలు చెప్పే వాళ్ళంటే మంట! హుఁ... బటాచోర్...ఆ దినం ఆఫ్రికా అనీ... ఖడ్గమృగం కొమ్మూ... దాని పొడీ... ఛ... ఛ... యూజ్‌లెస్ ఫెలోస్... పైగా వాడు తన 'పటిమ' పెంచడానికి అసలే మరకతం దెబ్బకు ఎట్లాగోలా ఆ ఎలుక బొమ్మలతో నెట్టుకొస్తున్నాడు గదా!

"కాబట్టి వన్యప్రాణులను సంహరించాడనీ... వాటిని ఆహారం కింద మార్పిడి చేసే కార్యక్రమంలో వుండగా సదరు నిందితుడు పోలీసు వారికి చిక్కినాడనీ రుజువై పోయింది. 1972 వైల్డ్ యాక్ట చట్టం కింద నిందితునికి శిక్ష విధించవలసిందిగా మనవి చేసుకుంటున్నాను" పి.పి. విశాలంగా నవ్వాడు. విషయం తేటతెల్లంగా కనిపిస్తుంది కాబట్టి డిఫెన్సు లాయరు (ప్రభుత్వమే నియమించింది) వాదన చేసే స్థితిలోనూ లేడు. కానీ కోర్టు బయట ఎల్లిగాడి పెళ్ళాం ఒంటిమీద చర్మం తప్ప ఏమీ లేని... ఎండకు కమిలిపోయిన పోరగాండ్లకు చుట్టేసుకుని ఒకటే గోలకు తగులుకుంది.

"ఓరోరి... యిదేడి అన్నాలం... కడుపుకు ఆకలిగాదా... దాన్లోకి గింతంత కూడో... కుతరో నింపాల్నా... గది పడకపోతే బతికేదెట్లగో జడిజీ గార్నడుగుత! గీ కూనలేం తిని సచ్చేటట్టు! ఓరోరి... కోట్లు... పంట్లాంలు... ఏసుకున్నోడో... మీరింఢ్లకాడ ఏం తింటం లేదా? తినకుండనే గిట్ట కోరుట్లెంటబడి తిర్గతన్నరా... యాడ్నుంచి దెచ్చుకుని తింటుర్రో... మేం యాడ్నుంచి తెచ్చుకుని తినాలి... ఏం తినాల్నో ఎవ్వడు జెప్పకపాయె...

అరిచీ... అరిచీ అక్కడ అది బోరింగు కాడ పోరగాండ్ల కింత దోసెడు మంచినీళ్ళు తావించి తానూ కడుపునిండుగా తాగింది.

జడ్జి మార్తాండం గారు కాస్సేపు భస్మాలు... లేహ్యాలు ఆలోచనలు మానేసి తలపంకించాడు.

"ఇంతకూ వాడు చంపిన మృగాలు... అయ్‌మీన్ ప్రొటెక్టెడ్ యానిమల్స్... వాటిని ప్రవేశ పెట్టండి...

పి.పి.గారు తికమక పడ్డారు. "సార్... అప్పటికే తమరికి మనవి చేశాను - వాటిని ముద్దాయి క్రూరంగా వధించాడు. పరపరా కోసి పొయిమీద కెక్కిచాడు. పంకాలు... అబ్బో... బలిసిన ఎలుకల్లా అటూ ఇటూ తిరిగే వకీళ్లు... తమాషాగా వుంది. బొక్కలో చేయిపెడితే లుకలుకలాడే ఎలుకల్ని పట్టుకుంటుంటే భలేగుంటది! అబ్బో... ఎన్నో ఎలుకలు... ఎంతతిండి...!

టకటకమని సుత్తె మోగించడంతో ఎల్లిగాడు జడ్జిగారి వంక ఆశ్చర్యంగా చూశాడు. జడ్జిగారు బాగా బలిసి వున్నాడు. నిగనిగలాడుతున్నాడు.. నల్లకోటు... నల్లతోలు... తోకమాత్రం లేదు... (ఎల్లిగాడికి పెద్ద పెట్టున నవ్వు వచ్చింది)

"అబ్జక్షన్... అసలు నిందితుడని చెప్పబడే సదరు ఎల్లిగాడు చంపిన జంతువేదీ... ఎలా చంపాడు... ఎందుకు చంపాడు.. చంపి ఏం చేశాడు? ఇన్ని శేషప్రశ్నలుండగా ఏకంగా శిక్షకే సిఫారసు చేస్తున్నారు!"

"సర్... ఇందులో మొదటి అంశానికి ప్రాధాన్యత... ఎందుకు... ఏం చేశాడూ... అన్నీ అప్రస్తుతం!" పి.పి.గారు గోలగోలగా భూతదయ... వన్యప్రాణి సంరక్షణ... మానవునికి ప్రకృతిపై దయా... విషయాల మీద సుదీర్ఘ ఉపన్యాసానికి తగులుకున్నాడు.

కోర్టు బయట ఎల్లిగాడి పెళ్ళాం లొల్లికి మల్రెడ్డి మదన పడీ.. పడీ.. చివరకు శాంతింప చేశాడు. పోరగాండ్లకు రెండు బిస్కెట్‌పాకెట్లు కొనిపెట్టాడు.

"అరె... నీ లొల్లేందే? ఏదో రెండు మూడు నెల్లు జెయిల్లో నూకుతారు - జెయిల్లో మస్తు తిండి... పప్పుచారు... వారానికింత మాంసం...

ఎల్లిగాడి పెండ్లాం కళ్ళు మెరిసాయి. "సరె బాబూ... వాడికి అక్కడ తిండీ.... పప్పు... మాంసం... మరి మా సంగతో... ఈ పోరగాండ్ల సంగతో...?"

మల్రెడ్డికి మండిపోయింది... వడివడిగా అక్కడ్నుంచి తప్పుకుని గార్డుకు సైగ చేశాడు. కోర్టులో మార్తాండంగారు ఆలోచనలో పడిపోయారు. పి.పి., డిఫెన్సులు జంతువుల ఆహారపు అలవాట్ల గురించి తీవ్రంగా వాదులాటకు తగులుకున్నారు. అందులోనూ శాఖాహారం... మాంసాహారాల మీద పోటాపోటీగా ఉదాహరణలు...స్టాటిస్టిక్సూ వల్లెవేస్తున్నారు.

"అసలు మనుషుల్ని తినే ఆదిమ వాసులింకా వున్నారు" అని డిఫెన్సు లాయరు పి.పి.మీదకు విరుచుకు పడుతుంటే మార్తాండం గారికి విపరీతమైన భయం వేసి వళ్ళంతా చెవట్లు పట్టాయి. నరమాంస భక్షణ... అబ్బో... క్రూరమైనదీ... మరకతం... నరమాంస భక్షణ...

"ఒరే.. నువ్వు ఆఫ్రికాగానీ వెళ్లావా?" మార్తాండం గారు నెమ్మదిగా ఎల్లిగాడ్ని అడిగాడు. వాడు బిత్తరపోయి తల అడ్డదిడ్డంగా ఆడించేలోగా మార్తాండం తేరుకుని సర్దుకున్నాడు.

"చెర్వుకింద పొలాల గట్లు... వరాలు.. కొండపాయలు... గాటిదగ్గరకు పోయ్న" మార్తాండం వినిపించుకోకుండా బలమైన సుత్తెను బాదడంతో కోర్టు హాలు నిశ్శబ్దమై పోయింది - హుఁ... ఖడ్గమృతం కొమ్ము ఎవడూ సాధించలేకపాయె! పనికిరాని చవటలు...

"యువరానర్... ఈ ముద్దాయి వండిన 'కూర' రిపోర్టు మన సెంట్రల్ ఫుడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారు పంపించారు. దాన్లో తేలిన

(మిగతా 23వ పేజీలో)

పుస్తక పరిచయం

పరిణత పరిశీలన

ప్రముఖ పత్రికలలో సంపాదక బాధ్యతలు నిర్వహించిన కె.రామచంద్రమూర్తిగారు 'వార్త' పత్రికలో వార్తావ్యాఖ్య శీర్షికన రాసిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం.

సాధారణంగా దిన పత్రికల రచనలు ఏ రోజుకు ఆ రోజుగా నడుస్తుంటాయి. దీన్నే బెర్నార్డ్‌షా ఎఫెమెరల్ అని వర్ణించారు. ఎవరు ఏది రాసినా ఈ పరిధిలో రాయాల్సిందే. అంతకు మించి వెళితే అది పాండిత్య ప్రకర్షగా మిగిలిపోతుంది. అదీ గాక దిన పత్రిక పాఠకులలో అన్ని తరగతుల వారు వుంటారు. జన సామాన్యం ఎప్పటికప్పుడు చూసి స్పందించే పత్రికలలో పాండిత్య ధోరణి సుతరామూ పనికిరాదు. మంచి జర్నలిస్టులెవరికీ అది ఇష్టంగానూ వుండదు. సరళంగా, సమగ్రంగా రాస్తూనే సాధ్యమైన మేరకు పాఠకులందరినీ అందుకోవడమనేది మంచి జర్నలిస్టుల పరమాశయంగా వుంటుంది. సహజంగానే రామచంద్రమూర్తి ఈ గీటురాయిని పాటించారు.

వార్తావ్యాఖ్య
రచన : కె.రామచంద్రమూర్తి;
వెల : రూ.50/-;
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

పత్రికల వార్తలలో అన్ని విషయాలు వస్తాయి. ఆ పైన రోజువారీ సంపాదకీయాలుంటాయి. ఇవీ గాక వ్యాసాలుంటాయి. సంపాదకీయాలు పత్రిక అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తే, వ్యాసాలు సమాచార ప్రధానంగా పూర్వాపరాలు చెబుతూ వ్యాసకర్త దృక్పథాన్ని వెల్లడిస్తాయి. ఈ రెండింటిలో కూడా సాధారణ వ్యాఖ్యానానికి అవకాశం తక్కువగానే వుంటుంది. విలేకరులుగా రిపోర్టు చేసినా, సంపాదకులుగా వ్యాఖ్యానించినా పాత్రికేయులు తవ వృత్తి జీవితంలో భాగంగానే అనేక అంశాలు గమనిస్తుంటారు. ఒక విధంగా వారు చరిత్రకు సాక్షులు. మరో విధంగా దాన్ని కొంత ప్రభావితమూ చేసే వ్యాఖ్యాతలు. ఈ ద్విముఖ బాధ్యత నిర్వహణ క్రమంలో అధినేతల ప్రవచనాలను, పోకడలను సినిమారీలులా చూడగల అరుదైన అవకాశం పత్రికా వృత్తి కల్పిస్తుంది. పరిణతి వున్న వారు సాధికారికంగా వ్యాఖ్యానించే వీలూ కల్పిస్తుంది.

మీడియా ఇంతగా విస్తరించనపుడు అన్నీ పత్రికల ద్వారానే తెలుసుకోవలసి వచ్చేది. కాని టీవీ విస్తరణతో పత్రికలు 'న్యూస్ బ్రేకింగ్' పాత్ర కోల్పోయాక విశ్లేషణ,వ్యాఖ్యానం ప్రధాన బాధ్యతలుగా తయారైనాయి. ఏ విషయాన్ని ఎలా చూడాలో పత్రికలు చెప్పాలని పాఠకులు ఆశిస్తున్నారు. ఆ క్రమంలోనే సంపాదకులు మొదటి పేజీలో ప్రత్యేక వ్యాఖ్యానం రాసే సంప్రదాయంపెరిగింది. వార్తావ్యాఖ్య ఆ కోవలో పాఠకులను అలరించింది.

ఒక విషయంపై వెనువెంటనే రాయాలంటే రాసేవారికి మంచి పట్టుండాలి. విమర్శలకు వెనకాడని ధైర్యముండాలి. అనవసరంగా నొప్పించకూడదనే సంయమనంతో పాటుగా నీళ్లు నమలకుండా చెప్పగల స్పష్టతా వుండాలి.సమాజ హితం గురించి, ప్రజా ప్రయోజనాల గురించి కచ్చితమైన అభిప్రాయాలుండాలి. పొడిగా, నిర్జీవంగా గాక నిశితంగా, ఆసక్తికరంగా రాయగల నిపుణతా వుండాలి. పేరుతో చేసే రచన గనక సంకోచాలు, సందిగ్ధతలకు ఆస్కారమివ్వని వ్యక్తిత్వమూ వుండాలి. ఇవి లేకుండా రాయబోతే అవి నీరసంగానూ అనవసరమైన పరిభ్రమణంగానూ పరిణమిస్తాయి. అలాటి ఉదాహరణలూ తెలుగు పత్రికా రంగంలో లేకపోలేదు.

ఈ సంకలనంలోని వ్యాసాలు చూసిన తర్వాత పాఠకులు రామచంద్రమూర్తి లోకజ్ఞతను, పరిపక్వతను, బహుముఖ పరిశీలనా శక్తిని ప్రశంసించకుండా వుండలేరు. ప్రభుత్వ నేతలనైనా ప్రధాన ప్రతిపక్ష నాయకులనైనా ప్రపంచాన్ని శాసించాలనుకునే అమెరికా సామ్రాజ్య వాదులనైనా ఆయన నిస్సంకోచంగా విమర్శిస్తారు. అందులోనూ ఈ రచనలకాలం ప్రపంచ చరిత్రలోనే కల్లోలిత కాలమని గుర్తు చేసుకుంటే ఆయన దృష్టి నైశిత్యాన్ని మరింత బాగా తెలుసుకోగలుగుతాము. ప్రధానంగా రాష్ట్ర పరిణామాలపై వున్నా జాతీయ అంతర్జాతీయ విషయాలను కూడా ఆయన ఎప్పటికప్పుడు పరిశీలించడం కనిపిస్తుంది.

విద్యుదుద్యమంపై కాల్పులు జరిపి ప్రాణాలు బలిగొన్నప్పుడు ఆయన రాసిన "ఇదేమి రాజ్యం?" ఆ రోజులలో ఒక కుదుపు కుదిపింది. ప్రకాశం పంతులు గుండెలు చూపిస్తే తెల్లవారు కాల్చలేదు గాని ఈనాటి పోలీసులు నిస్సందేహంగా కాల్చేశారని ఆయన పోల్చిచెప్తారు. అసెంబ్లీ, పార్లమెంటు కవరేజి పట్ల, వాటి నియమనిబంధనల పట్ల మంచి అవగాహన వుంది కనక శాసనసభ వేదికపై విన్యాసాలను, వివాదాలను వివరంగా విశ్లేషిస్తారు.నిజానికి ఈ అంశాలపై ఆయన రాసిన వ్యాఖ్యలు ఇంకా అనేకం వున్నాయి.

రామచంద్రమూర్తి వ్యాఖ్యల్లో కేవలం ఒక రాజకీయ విశ్లేషణేగాక సామాన్యజనం నాడిని పట్టి చూపించే సామర్థ్యం ఎక్కువగా కనిపిస్తుంది. ఒక ఘటనపై సామాన్యుడు అప్పటికప్పుడు ఎలా స్పందిస్తాడో అలాగే ఆయన రాసేస్తారు. ఉదాహరణకు పార్లమెంటుపై దాడి జరిగినపుడు ఇతర అంశాలకన్నా భద్రతా సిబ్బంది తెగువను అభినందించడం ప్రధానమని ఆయన భావిస్తారు. ఫూలన్ దేవి హత్య వల్ల అలాటి వారు ప్రజాస్వామ్య స్రవంతిలోకి వచ్చే ఒక ప్రయోగం ఆగిపోయిందని ఆవేదన చెందుతారు. వాజ్‌పేయి విశ్వాస తీర్మానం నెగ్గించుకున్నపుడు గెలిచివోడారని అంటారు. ఎన్నికల ప్రచారంలో వ్యక్తిగత భజనలు వెగటు పుట్టించే స్థాయికి చేరినపుడు నిశితంగా విమర్శిస్తారు.

మేధావులకు బహిరంగ లేఖ వంటి రచనలలో ఆయన అవకాశ వాద ధోరణులను మందలిస్తారు. సెప్టెంబరు 11 దాడి తర్వాత దిక్కుతోచని దిగ్గజం తదితర వ్యాఖ్యలలో ఆయన అమెరికా సామ్రాజ్యవాద దుర్నీతిని ఎండగడతారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ఫలితాలను ఆర్థిక పరంగానేగాక జీవిత వాస్తవాల కోణం నుంచి ఆయన విశదపరుస్తారు. విద్యుత్ రంగంలో సంస్కరణల ప్రభావాన్ని గురించి ఆయన సమగ్ర వ్యాస పరంపర వేరే పుస్తకంగా వచ్చిన సంగతి తెలిసిందే. తను రాసే శీర్షిక పరిధి కచ్చితంగా పాటించే వ్యక్తి గనకే ఆయన ఎక్కడ శైలి అక్కడ అనుసరించారు. ఇది రచయితగా ఆయన క్రమశిక్షణకు నిదర్శనం. ఈ విధంగా ఒక పద్ధతి ప్రకారం రాసినవి కనకే ఈ వ్యాఖ్యలు ఇప్పటికీ పఠనీయమవుతున్నాయి.

✻ తెలకపల్లి రవి

అబ్బా ఎందుకయ్యా ఇలాంటి నాటకాలతో మమ్మల్ని చంపుతారు.
ఇవి 'నంది' నాటకాలా లేక తలాతోక లేని పిచ్చి ప్రదర్శనలా..?
కళాకారులను ఉద్ధరించడానికి 'నంది' పేరుతో ఇంత డబ్బు తగలెయ్యాలా?
రండి భాయ్.. అలా రవీంద్రభారతిలోకి వెళ్లి కాసేపు హాయిగా నిద్ర పోదాం..!

ఆర్భాటానికి ప్రతీకగా 'నంది' ప్రారంభం

నంది స్థాయిని నిలబెట్టండి..

ఇలాంటి కామెంట్లతో ముగిసిన ఐదవ నంది నాటకోత్సవాలపై అటు నాటకాభిమానుల్లోనూ ఇటు రంగస్థల ప్రముఖుల్లోనూ భిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే నంది నాటకోత్సవాల తీరుతెన్నులపై విమర్శలు రావడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. గత నాలుగేళ్లుగా ప్రేక్షకుల మెప్పు పొందిన నంది నాటకోత్సవాలు ఈ ఏడాది మాత్రం పలు విమర్శలకు తావిచ్చాయి. నాటకాల ప్రాథమిక ఎన్నిక మొదలుకొని జడ్జిమెంట్ వరకూ అనేక విమర్శలను మూటగట్టుకున్న 'నంది' స్థాయి ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో వారంరోజులపాటు నిర్వహించబడిన నంది ప్రదర్శనలు పది రోజులు కొనసాగించబడి ప్రేక్షకాభిమానాన్ని ఏమాత్రం కూడగట్టుకోలేక పూర్తిగా చతికిలబడ్డాయి. నాటకరంగ వికాసానికి దోహదపడాలనే సంకల్పంతో దివంగత నేత ఎన్టీఆర్ జన్మదినాన గత అయిదేళ్లుగా ఆర్భాటంగా జరిపే నంది వేడుకలు కేవలం 'లక్షల' ఖర్చుకే తప్ప కళాకారులకు నిజంగా దగ్గరవుతున్నాయా అన్నది మరో ప్రశ్న. సాంఘిక నాటకాలు, పద్యనాటకాల మేళవింపుగా నిర్వహించే నంది ఉత్సవాలకు 2002 పోటీ ప్రదర్శనలకు ఎంపికైన నాటకాల్లో సగానికి పైగా ప్రేక్షకాదరణకు నోచుకోలేక పోయాయి. కారణం నాటక సమాజాలు లేకనా? రచయితలు కరువయ్యారనా? లేక నాటకాలే తెరమరుగయ్యాయనా? ఇలా అనేక ప్రశ్నలకు అవకాశం కల్పించిన ఈ ఏడాది నంది నాటకోత్సవాలు 'పసలేని నాటకాలతో' నిరాశాజనకంగా ముగిశాయి. ప్రతిష్టాత్మక ఉత్సవాలుగా భాసిల్లవలసిన 'నంది' నాటకోత్సవాల నిర్వహణలో పారదర్శకత అవసరమని ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్న కళాకారులకు అధికారులే జవాబు చెప్పాలి.

గతం...వర్తమానం

నాలుగేళ్లు పూర్తిచేసుకున్న నంది ఉత్సవాల నేపథ్యాన్ని పరిశీలిస్తే గతంలో వారానికిమించి ప్రదర్శనలు ఉండేవి కావు. పద్య, సాంఘిక నాటకాలతో కలిపి సుమారు పాతిక ముప్పయి నాటకాలకు మాత్రమే పోటీప్రదర్శనకు అవకాశం కల్పించేవారు. దాదాపు ప్రదర్శనకు ఎన్నికైన నాటకాలన్నిటిపై ప్రేక్షకులు సదభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. అలాగే కళాకారులకు ప్రథమ, ద్వితీయ, ఉత్తమ అవార్డులకు ఇచ్చే నగదు పారితోషకం కూడా సంతృప్తికరంగా ఉండేది. ఈ ఏడాది మాత్రం ప్రదర్శనలకు 'పెద్దపీట' వేస్తున్నాం అంటూ నాటకాల సంఖ్యను పెంచి కళాకారులకిచ్చే పారితోషికాన్ని సుమారు ఐదువేల రూపాయలు వరకూ తగ్గించారు. గతంలో కంటే ఏభై శాతం నాటకాల సంఖ్యను పెంచినా నంది స్థాయిని అందుకున్న నాటకాలు కేవలం పదిలోపే ఉన్నాయన్నది ప్రేక్షకుల వాదన.

పద్యనాటకాలకు నిజంగా పెద్ద పీట వేశారా?

గతంలో కంటే ఈ ఏడాది సంప్రదాయ పౌరాణిక నాటకాలకు పెద్దపీట వేయాలనే 'నినాదం'తో 20 పద్య నాటకాలను ఎన్నికచేయడం జరిగింది. వాటిలో ఓ అరడజను నాటకాలే వందేళ్ల చరిత్రగల పద్యనాటక ప్రతిష్టకు దగ్గరగా నిలిచాయి. మిగతావన్నీ 'ఇవి పద్యనాటకాలా లేక పద్యనాటకాలకు పేరడీలా' అన్నరీతిలో సాగాయి.

సాంఘిక నాటకాల్లో 'ప్రయోగాలు'రావా?

'కొత్త రచనలకు మాత్రమే' అన్న షరతుతో ఎన్నిక చేసిన సాంఘిక నాటిక-నాటకాలు జడ్జీలను సైతం 'జోకొట్టాయంటే' ఆశ్చర్యపడనక్కరలేదు. ఒకటి అరా తప్ప చాలా వరకూ 'మెలోడ్రామాను' ప్రదర్శించినవే. ఇక ప్రయోగాత్మక నాటకాలు లేనే లేవని చెప్పాలి. పదేళ్ళనాటి నాటకాలనే మళ్ళా తిరగరాసి చూపిస్తున్నారా ? అన్న అనుమానం ఈ నాటకాలు కలిగించాయి.

తుది తీర్పులోనూ..తెలియని మెలిక

20 పద్యనాటకాలు, 17 నాటికలు, 9 సాంఘిక నాటికలు ప్రదర్శితమైన ఐదవ నంది నాటకోత్సవాల్లో తుది తీర్పు పలు సందేహాలను లేవనెత్తింది. గతంలో నంది ఉత్సవాల్లో 'బంగారు నందులను' కైవశం చేసుకున్న డాక్టర్ మీగడ రామలింగస్వామి నాటక సమాజం ఈ ఏడాది కూడా 'గుణనిధి' ప్రదర్శనతో అంతే స్థాయిని ప్రదర్శించింది. వరసగా ఉత్తమనటుడు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ రచనకు బంగారు నందిని గెలుచుకున్నప్పటికీ ఉత్తమ నాటకంగా నిలవకపోవడం నాటకాభిమానులు జీర్ణించుకోలేక పోయారు. రచన, దర్శకత్వం, ఉత్తమ నటుల ప్రతిభకు అద్దం పట్టిన నాటకాన్ని 'వెండి నంది'తో కట్టడి చేయడాన్ని ప్రేక్షకులు హర్షించలేక పోయారు. 'ఇది అన్యాయం..అక్రమం' అంటూ బాహాటంగానే న్యాయనిర్ణేతలను తప్పుపట్టారు. ఇక సాంఘిక నాటిక-నాటకాల్లో తొంభై శాతం ప్రేక్షకుల నిరుత్సాహాన్ని చవిచూసినవే కనుక న్యాయనిర్ణేతలు కూడా ఉత్తమ ప్రదర్శన ఎన్నికల ప్రక్రియను 'నల్లేరుపై బండినడకలా' ముగించారు.

* గంగాధర్ వీర్ల


ప్రేక్షకుల దృష్టిలో గుణనిధే 'బెస్ట్'


ప్రేక్షకులు మెచ్చిన 'రిక్త సంబంధాలు' నాటికలోని సన్నివేశం

"ఏమండీ! అబ్బాయి మంచం మీద నుంచి కింద పడిపోయాడు. కదలలేక పోతున్నాడు. డాక్టర్‌ను పిలుచుకుని రండి!" తులసివేణి భర్తను నిద్రలేపింది.

బోణం కృష్ణమూర్తి మత్తుగా నిద్రలేచాడు..

మంచ మీద నుంచి బంతిలా కింద పడిన కొడుకు ప్రసాద్ కనిపించాడు. వెంటనే వెళ్ళి కూర్చోబెట్టాడు.

ఎదురీదిన వైకల్యం

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఇరవయ్యేళ్ళ ప్రసాద్ జాలిగా చూస్తున్నాడు.

కేవలం అడుగు ఎత్తు ఉన్న అతని తొడ ఎముక విరిగిపోయింది. కదలలేక కన్నీళ్ళతో కన్న తండ్రిని చూశాడు.

ప్రసాద్ తల్లి గాబరా పడుతోంది.

కృష్ణమూర్తి పక్కింటికి వెళ్ళి డాక్టర్ గారికి ఫోన్ చేయించాడు. అంతరాత్రి రావడం కుదరదని మర్నాడు వస్తానని' చెప్పాడు.

నిరాశగా ఇంటికి తిరిగి వచ్చాడు.

"ఏమైంది?' అని కళ్ళతో ప్రశ్నించిన భార్యకు కొడుక్కి ఏ సమాధానం చెప్పలేక కళ్ళనీళ్ళు కుక్కుకున్నాడు. భార్య సాయంతో కొడుకు ప్రసాద్‌ను బస్తామోసినట్లు మంచం మీద పడుకోబెట్టాడు.

కదలలేని ఆరు అంగుళాల తొడని మృదువుగా నిమిరాడు. తులసి వేణి అమృతాంజనం రాసి వేడినీళ్ళతో కాపడం పెట్టింది.

ప్రసాద్ బాధతో విలవిల్లాడిపోతున్నాడు.

"బాబూ! తెల్లవారిన వరకూ కాస్త

బాధను ఓర్చుకో.... ఉదయం డాక్టర్ వస్తారు. అన్నీ చూస్తారు..." అంది.

అలాంటి మాటలు తల్లి నుంచి ఎన్నోసార్లు వినడం వల్ల ప్రసాద్‌లో పెద్దగా స్పందన కనిపించలేదు.

కృష్ణమూర్తి 'మరేమీ పర్వాలేదు' అని అనునయించాడు. నిద్రరాని ఎన్నో రాత్రులు బాధను దిగమింగి బతుకుతున్న ప్రసాద్ కళ్ళు మూసుకున్నాడు.

తులసివేణి దుప్పటి కప్పి చాలాసేపు జో కొడుతూ అక్కడే మంచం మీద కూర్చుంది.

* * *

తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన బోణం కృష్ణమూర్తి, తులసి వేణిల నలుగురు సంతానంతో ప్రసాద్ అందరి కన్నా పెద్దవాడు. ఏకైక పుత్రుడు.

పుట్టిన రెండేళ్ళ వరకూ బాగానే ఉన్న ప్రసాద్‌కు ఆ తర్వాత నుంచి కష్టాలు మొదలయ్యాయి. చిన్నతనంలో జారిపడటంతో ఎడమకాలి తొడ భాగం విరిగిపోయింది. అప్పటి నుంచి ఎముకల పెరుగుదల ఆగిపోయింది. అప్పటి నుంచి రెండుకాళ్ళ తొడల పై భాగంలో పదిసార్లు ఎముకలు విరిగిపోయాయి.

కాళ్ళు అడుగు పొడవు కూడా ఎదగలేదు. మనిషి మాత్రం పెరిగాడు. దీంతో అందవికారంగా బంతిమాదిరిగా తయారయ్యాడు. చేతులు కూడా వంకర్లు పోయి పిల్లల మాదిరిగా చిన్నవి అయిపోయాయి. దీంతో అన్నం తినడం కూడా కష్టం అయిపోతోంది. వయసు పెరుగుతున్నా ఎదగని శరీరంతో ప్రసాద్ ఎన్నో అవస్థలు పడుతున్నాడు.

అతని తర్వాత పుట్టిన ముగ్గురు అమ్మాయిలు సక్రమంగానే ఉన్నారు. సత్తువ లేని

ఎముకలతో ఏ పనీ చేయలేని దయనీయ స్థితిలో జీవితాన్ని భారంగా గడుపుతున్నాడు.

కన్నప్రేమ, కడుపుతీపితో కొడుకును చూస్తూ కళ్ళల్లో నీరు తెచ్చుకోవడం తప్ప పరిస్థితి నుంచి బయటపడే స్తోమత కూడా లేని పేదరికం వారిది.

* * *

డాక్టర్ ధన్వంతరి నాయుడు ప్రసాద్‌ను పరీక్షించాడు.

తరచూ ఎముకలు విరిగిపోవడం... వాటికి ఉండవలసిన బలం లేకపోవడాన్ని పరీక్షించారు.

"డాక్టర్! మా అబ్బాయి పరిస్థితి ఏమిటి?" భార్యాభర్తలిద్దరూ ప్రశ్నించారు.

"ఆస్టియా జెనిసిస్ ఇమ్ పెర్‌ఫెక్టా' అనే వ్యాధి సోకింది!" అన్ని పరీక్షలు చేసిన తరువాత చెప్పారు.

"అంటే?"

"ఈ వ్యాధి కొంతమందికి అరుదుగా సోకుతుంది. పుట్టిన కొన్ని నెలల నుంచి ఎముకలు విరగడం మొదలవుతుంది. ఎముకల నిర్మాణంలో వంకర్లు రావడానికి కూడా అవకాశం ఉంటుంది!"

"చికిత్స చేయించడం కుదరదా?"

"టెలిస్కోపిక్ ఇంట్రామెడులరీ రాడ్స్ వేయడం ద్వారా కొంతవరకూ నివారించవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల విరిగిపోతున్న ఎముకలు అతుక్కోవడానికి అవకాశం ఉంటుంది. తర్వాత విరిగిపోకుండా కాపాడతాయి!" డాక్టర్ చెప్పారు.

"డాక్టర్! మా వాడి బాధ మరి తీరదా?" కన్నతల్లి ప్రశ్నించింది.

డాక్టర్ ధన్వంతరి నాయుడు చాలాసేపు ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

"ఈ వ్యాధి సోకిన వారికి పద్దెనిమిది ఇరవై ఏళ్ళ వయసు వచ్చే లోపు చికిత్స చేయాలి. మీ వాడి వయసు అంతకన్నా ఎక్కువగా ఉంది.



కష్టం..." భారంగా చెప్పాడు.

ప్రసాద్ దీనంగా డాక్టర్ వైపు జాలి చూపులు చూస్తూ కూర్చున్నాడు.

డాక్టర్ ప్రసాద్ దగ్గరికి వచ్చి 'నిరాశ చెందనవసరం లేదని... మనిషి కదలలేకపోయినా ఎన్నో పనులు చేయవచ్చునని" ఊరడించాడు.

డాక్టర్ మాటలు ప్రసాద్‌లో ధైర్యాన్ని నింపాయి. జీవితంపై మక్కువ పెంచాయి.

* * *

ఇప్పుడు-

మంచంపైనే ప్రసాద్ అన్ని పనులను చేసుకుంటున్నాడు.

ట్యూషన్ మాస్టర్‌ను కుదుర్చుకుని అక్షరాభ్యాసం చేశాడు. వంకర్లు పోయిన చేతులతో రాయడం నేర్చుకున్నాడు.

చుట్టుపక్కల వారికి ఉత్తరాలు రాయడం... చిన్న చిన్న దరఖాస్తులు రాయడంతో తన లోపాన్ని అధిగమిస్తున్నాడు.

రోజూ వార్తాపత్రికలు చదువుతూ విశేషాలన్నీ తెలుసుకుంటూ ఆ విషయాలను ఇంటికి వచ్చిన వారికి తెలియజేస్తుంటాడు.

పొదుపు గురించి ప్రచారం చేస్తాడు.

అసంఘటితంగా ఉన్న మహిళల్ని... ఇంటి చుట్టుపక్కల చేసేందుకు ఎలాంటి పని దొరకక ఖాళీగా వున్న మహిళల్ని సంఘటిత పరిచి వారితో పన్నెండు స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటు చేయించాడు.

వారితో పొదుపు చేయించి ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నాడు.

తన అంగవైకల్యాన్ని చూసి కుంగిపోవడం లేదు.

ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాడు. ◆

జీవకారుణ్యారణ్యం

(19వ పేజీ తరువాయి)

అంశం ఏమిటంటే... అది ఎలుక మాంసం...

అప్పటివరకూ వుద్వేగతంతో వాదించిన పి.పి. నీళ్ళు నమిలాడు. మార్తాండంగారు చూసిన చూపు క్రూరంగానే వుంది.

"యువరానర్... ఈ మూషికాలు రైతులకు కలగజేసే హాని అంతా ఇంతా కాదు... సంవత్సరానికి పది లక్షల టన్నుల ధాన్యాన్ని స్వాహా చేస్తున్నాయి...

డిఫెన్సు గారి మీదికి పి.పి. బెబ్బులిలా లేచాడు.. "అబ్జక్షన్... మన సెంట్రల్ గోదాంలో ఆరుకోట్ల టన్నుల బియ్యాన్ని ఎలుకలు గత మూడేండ్ల నుండీ తీరుబడిగా భోం చేస్తున్నాయి. అంతమాత్రాన వాటిని శిక్షించగలమా...? శిక్షిస్తున్నామా?"

"తప్పకుండా శిక్షించాల్సిందే... అవి జనం కోసం... తిండిగింజలు... వాటిని భోంచేసే హక్కు పందికొక్కులకూ... ఎలుకలకూ లేదు!"

"అట్లా అయితే బినామీ కంట్రాక్టర్లూ....రాజకీయ నాయకులూ... అధికార్లూ... 'పనికి ఆహార పథకం' కింద ఆ ఎలుకల కన్నా ఎక్కువే భోం చేశారు.. వాళ్ళందరినీ శిక్షించాల్సిందే...

పి.పి. పెడబొబ్బలు పెట్టాడు... ప్రేక్షకులు దాన్లో భాగస్వాములై బాహాటంగా తిండిదొంగల గురించీ... ఎలుకల గురించీ చర్చ రసవత్తరంగా చేస్తున్నారు. ఖడ్గమృగం కొమ్ముగురించీ ఆలోచిస్తున్న మార్తాండం గారికివేం పట్టకుండా కూర్చున్నాడు.

ఎల్లిగాడికి కడుపులో సురుసుర ఆకలి ప్రవేశించింది. వారితో బాటే చురుకైన ఆలోచన్లు... ఎట్లాగైనా సరే... ఆయఫ్సీ గోడోన్ల దగ్గరకు పోవాలి.... అవెక్కడున్నాయో.. ఎట్లా పోవాల్నో.. గంపలు గంపలు ఎలుకలు" రోజూ కమ్మగా తినొచ్చు.. కడుపునిండా తినొచ్చు.. ఈ ఆకలి తీరే మార్గం అదే... నలుగురికీ ఉచితంగా రోజూ రెండో మూడో పారేస్తే వాళ్ళే కాల్చుకుని తిని బతుకుతారు! అబ్బ... తలంతా సమ్మెట పోట్లు...

"ఓయి ఎల్లయ్యా... అంతా విన్నావు గదా... నీమీద అతి క్రూరమైన 'వన్యప్రాణ సంరక్షణ నిషేధ ఉల్లంఘన' చట్టం కింద కేసు నమోదు చేయబడి విచారణ సాగుతుంది. విన్నావుగదా... నువ్వు చెప్పదలుచుకున్నదేమైనా వుంటే చెప్పుకోవచ్చు!"

"చెప్పుకోవడానికేముంది.. నే చెప్పేది ముందుగా బియ్యం గోదాముల మతలబు చెప్పండ్రి నీ బాంచను.. ఎందుకంటే యెట్టాగు గా బియ్యం మాలాటోళ్ళు తినకుండ పుచ్చిపోతన్నై... అట్ని తిని పార్నూకే ఆ ఎలుకల దండు మీదబడి వాట్నయినా ఆరగించి గీపాడు పొట్టలు నింపుకుంటం. నీ బాంచను.. ఎటు చూస్తే అటు ఏ ఆధారం లేనోల్లం..

రెండుసార్లు నుత్తెబాదాడు మార్తాండంగారు. అప్పటికపుడే ఎలుకలు అరణ్య జీవులా... పట్టణ జీవులా... అబ్బో... అయితే దీనిమూలం చాలా దూరం వుందీ అని సరిపెట్టుకున్నారు.

"గట్ల గా ఎలుకల్ని పూరా తిని పార్నూకితే గా బియ్యానికి ఈటి బాధ తప్పిపోద్ది... బియ్యం సేఫు! ఇంగ కంట్రాక్టు మారాజులు వాటిమీద బడి మేయెచ్చు. ఇంకోమాట మారాజా... గీ ఆకల్ని పుట్టిచ్చిన వెదవెవరో నాకు తెలవకపాయె! అది పొద్దంత ఒకటే యావాయె! దానికి ఇరుగుడు గింత 'బువ్వ' ఏ మారాజు' దోవ జూపిచ్చకపాయె! అడువులున్నై... జీవరాసులున్నయ్... ఒకదాన్నొకటి ఆకలికి పీక్కుతింటన్నై! ఆకలి సల్లారుచుకుంటన్నై! నీ... మనిషీ మనిషిని పీక్కుతింటం ఇక్కడ్నే సూసుడు... మీరేసిచ్చు... ఎన్నేండ్లు ఏసినా నాకేం లెక్కలేదు. ఏస్కోండి.. ఏసేస్కోండి...!"

అట్లా అని ఎల్లిగాడు చాలా నిర్భీతిగా తన కడుపులోని అక్కసునంతా వెళ్ళగక్కిన వాడాయెను.. ఆ సారాంశం మొత్తం విన్న శ్రీమార్తాండంగారి తనువంతా కుతకుత వుడికిపాయెను.. పి.పి., డిఫెన్సుల నోర్లు మూగబోయిన వాయెను. వీడి వాలకం జూస్తే దేశంలోని ఎలుకలనన్నింటినీ ఒక్కడే తిని జీర్ణించుకునే ప్రమాదం కనిపిస్తుంది. అసలు ఈ ఎలుకలు లేకపోవడం వల్ల మరకతం లాంటి వాళ్ళకు మరెవరితో భయం వుంటుంది?

శ్రీశ్రీగణపతి మహారాజుగారి వాహనంగారు.. హారిబుల్! అయినా హాయిగా ఏ కూలో... కాంట్రాక్టు పన్లో చూసుకోక ఇట్లా అడవి జంతువుల వెంటబడడం బార్బేరియన్...సమాజం అరణ్యంలా మారిపోతుంది... వేట... అన్నిట్లో వేట... అరణ్యంలోని సమాజం బెటరు... వీడు అరణ్య సమాజాన్ని ఆధునిక సమాజంలోకి లాక్కొస్తున్నాడు – వీడికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలె! అపుడే ఈ సమాజానికి శాంతి.

జడ్జిమెంటు మర్నాటికి వాయిదా వేసి మార్తాండం గారు కోర్టు చాలించారు. ఆ క్షణం నుండీ రేపు కోర్టు ప్రారంభమయ్యే లోపు మార్తాండం గారితో మరకతం - మరకతంతో మార్తాండంగారు వేగడాన్ని బట్టి వాడి శిక్ష ఖరారు చేయబడుతుందని అందరికీ తెలుసు! ◆



✻ కొండబాబు

ఆ ఇంట్లో పెళ్లి జరుగుతోంది.

పది సెంట్ల స్థలంలో ఐదు గదులతో కట్టిన పెంకుటిల్లది. ముందు వరండా. దాని ముందు విశాల ఖాళీ స్థలంలో వేసిన తాటాకుల పందిరి. కొత్తాకులేమో... పందిట్లో కట్టిన మామిడి తోరణాలతో కలసి వింతైన మంచి వాసన వేస్తున్నాయి.

మేళ తాళాలు జోరుగా మోగుతున్నాయి. తాళి తంతు దగ్గర పడింది. పెళ్లి కొడుకు తండ్రి పెళ్లి కూతురి తండ్రితో ఏదో వాదు లాడుతున్నాడు. అకస్మాతుగా..

''పెళ్లాపండి'' అంటూ అతగాడు ఒక్కసారిగా కేక వేశాడు. బాజాలు ఆగిపోయాయి. అంతా నిశ్శబ్దం.

"అంత కట్నం ఇవ్వలేని వాడివి ముందు ఎందుకు ఒప్పుకోవాలి?" అంటున్నాడతడు. అందరికీ విషయం అర్థమైంది.

పెళ్లి కూతురు మేనమామ అయిన ఏభై ఏళ్లాయన వారి మధ్యకొచ్చాడు. ఏదో సర్ది చెప్పాడు. అయినా పెళ్లికొడుకు తండ్రి విన లేదు.

"సరే.. ఇప్పటి వరకూ అయిన ఖర్చులు కట్టి కదలండి" అన్నాడు పెళ్లి కూతురి మేనమామ. ఆయన అలా అంటాడని ఎవరూ ఊహించలేదు.

" అదెలా కుదుర్తుంది"?

"కుదరకపోతే నీ కొడుకు ఇక్కడే ఉంటాడు నువ్వెళ్లు"

"ఏం మాట్లాడుతున్నావ్.. నా కొడుకుని తీసుకునే వెళతాను"

"నీ కొడుకు రాడు.. తక్షణం నువ్ దయ చేయక పోతే అర్ధ చంద్రప్రయోగం తప్పదు." పెళ్లికుమార్తె మేనమామ వాదనకు అందరూ కంగు తిన్నారు.

* * *

వరకట్నాలు.., సమస్యలు.., గొడవలు ఇటీవల సహజమయ్యాయి. డబ్బు కక్కుర్తిగాళ్ల నిలదీతకు గురవడం వంటి మంచి పరిణామాలూ ఇటీవల జరుగుతున్నాయి. పేర్కొన్న ఘటనలో పెళ్లికుమార్తె మేనమామ 'అర్ధచంద్రప్రయోగం' అనే పలుకుబడిని ప్రయోగించారు. దాని గురించి తెలుసుకుందాం.

అర్ధచంద్ర ప్రయోగమంటే చాలా మందికి తెలియదు. అందువల్లే కాబోలు దాని వాడుక కూడా (ఈ పలుకుబడి వాడుక) కూడా తక్కువ. 'చంద్రుడితో కూడిన ఒక పురాణ ఘటన' పలుకుబడిగా మారిందనుకునే వాళ్లు ఉన్నారు. కానీ కాదు. అసలు పురాణాలతోనే సంబంధం లేనిది. 'అర్ధచంద్రప్రయోగ' మంటే మెడబట్టుకుని గెంటడం. ఈ రెంటికీ ఉన్న అర్ధ సాపత్యమేమిటనే ప్రశ్న ఉదయించడం సహజమే. ఒక వ్యక్తిని మెడబట్టి గెంటాలంటే చేతి బొటన వేలును మిగతా వేళ్లను విడదీసి చాపాలి. ఇలా చేస్తే చెయ్యి నెలవంక ఆకారంలోకి వస్తుంది. అంటే అర్ధచంద్రాకారం. అదీ అర్ధ చంద్రప్రయోగమంటే. శిష్ట కుటుంబాల్లో గెంటడమనే అర్థానికి కాస్త భాషా గౌరవాన్ని జోడించి ఈ పలుకుబడిని ప్రయోగిస్తారన్నమాట.

'నిత్యకళ్యాణం పచ్చతోరణం' అనే జాతీయం గురించి తెలుసుకుందాం. ఇది తిరుమల వెంకటేశ్వరుడికి జరిగే కైవల్యాలలోంచి పుట్టింది. దీని అర్థమేమిటంటే..

నిత్యం సంతోషమయంగా గడపటమని. కళ్యాణం జరిగే ఇల్లంతా పచ్చని తోరణాలతో ఉంటుంది. కళ్యాణ మంటే శుభకార్యాలని అర్థం. పచ్చని తోరణాలు కనిపించడమంటే అందరూ కళకళలాడుతుండటం.

'రోజూ కల్యాణ సేవలు జరిగే ఏడుకొండలవాడి వద్ద ఎప్పుడు కళకళే' అనే భావంనుంచి ఆ విధంగా సుఖవంతంగా, శుభకరంగా జీవించే వారినుద్దేశించి 'నిత్యకళ్యాణం పచ్చతోరణం' అంటుంటారు.

'అడుగులకు మడుగులొత్తడమనే' జాతీయాన్ని చాలా మంది వినే ఉంటారు. ఎక్కువ మంది ప్రధానంగా రాజకీయనాయకులు, సాహిత్యకారులు, పత్రికల వాళ్లూ ఎక్కువగా వాడుతుంటారిది. 'అధినేత అడుగులకు మడుగులొత్తుతాడు ఈయన' అనే వ్యాఖ్యలు వినపడుతుంటాయి కదా!

ఆయనేది చెప్పినా, ఈయన దీనికి మద్దతిస్తుంటాడనే అర్థంతో, దీన్ని వాడతారు. కానీ వాస్తవం ఇంకొంచెం లోతైన అర్థంతో ఉంది. ఆయన చెప్పబోయే దానికి అందరూ ఒప్పుకునేలా ముందే ఈయన ప్రాతిపదిక వేస్తాడనేది అది. మడుగు అంటే వస్త్రమని అర్థం.

వెనకటికి రాజుగారు నడుస్తుంటే ఆయన అడుగులు వేయడానికి ముందర వస్త్రాన్ని పరుస్తుండేవారు.. ఆయన నేల మీద నడవకూడదని. అదీ వాస్తవార్థం. అడుగులకు మడుగులొత్తడమంటే ఆయన ఏది చెపుతాడో దానికి అందరూ ఒప్పుకునేలాగ ముందుగానే భజన చేయడం. అదీ అర్థం. ◆

పాఠక స్పందన

'కొన'లేనోళ్లకి చదువులు సున్నా

జూన్ 8వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ 'కొన'గలిగితేనే చదువు? చాలా బాగుంది. అత్యధికంగా వున్న పేదల పిల్లలకు చదువులు అందని ద్రాక్షలా తయారయ్యాయి. ప్రస్తుత విద్యావిధానం కేవలం డబ్బున్న వాళ్ల కాళ్ళకు మడుగులొత్తే పద్ధతిలో తయారవుతోంది. తెలివితేటలుండి, ప్రతిభవుండి కూడా డబ్బులేకపోతే చదువుకోలేని పరిస్థితి నిజంగా దారుణం.

– మోహన్, విజయవాడ

సెలవుల్ని వినియోగించుకోవడం తల్లిదండ్రుల బాధ్యత

జూన్ 1వ తేదీ సంచికలో 'సెలవుల్ని సద్వినియోగం చేసుకోవాలి' అనే శీర్షిక పిల్లల్లో సృజనాత్మక విలువల్నెలా పెంపొందించాలో అనేది తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తోంది. పాఠకులు పొల్గొనే మరిన్ని శీర్షికలు అనుబంధంలో చోటు చేసుకోగలవని ఆశిస్తాను.

– డి.పార్వతమ్మ, వేలం వీధి, గవరపాలెం

నవ్విస్తున్న కార్టూన్ కదంబం

ప్రతి వారం మీరు ప్రచురిస్తున్న కార్టూన్ కదంబం చాలా బాగుంటోంది. మమ్మల్ని ఎంతగానో నవ్విస్తోంది.

– పుట్టాశ్రీనివాసరావు, లక్కవరపుకోట.

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

భారత రాష్ట్రపతి డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలాం కుప్పం పర్యటన విజయవంతం అయిన శుభ సందర్భంగా కృతజ్ఞతలతో...

ప్రగతిపథంలో కుప్పం నియోజకవర్గం

(1994 నుంచి 2003)

విద్య :

అక్షరాస్యత	- 30 శాతం నుండి 52కు పెంపు
ప్రాథమిక పాఠశాల	- 255-396
ప్రాథమికోన్నత పాఠశాల	- 27-88
ఉన్నత పాఠశాల	- 14-46
జూనియర్ కళాశాల	- 1-6
వైద్య కళాశాల	- 0-1
ఇంజనీరింగ్ కళాశాల	- 0-1
ఫలితాలు (10వ తరగతి)	- 43 శాతం నుండి 95కు పెంపు
(7వ తరగతి)	- 48 శాతం నుండి 99కు పెంపు
ద్రవిడ విశ్వవిద్యాలయం	- 0-1
పాలిటెక్నిక్ కళాశాల	- 0-1
అగస్త్య ఇంటర్‌నేషనల్ స్కూల్	- 0-1
మిషనరీ స్కూల్	- 0-1

ఆరోగ్యం :

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	- 5 నుండి 8
కుటుంబ నియంత్రణ	- 60 శాతం నుండి 100 శాతం
ఆసుపత్రి ప్రసవాలు	- 7 శాతం నుండి 77 శాతం
వ్యాధి నిరోధక టీకాలు	- 30 శాతం నుండి 100 శాతం
సి.బి.ఆర్.	- 23 నుండి 19.7
సి.డి.ఆర్.	- 10.2 నుండి 4.5
ఐ.ఎం.ఆర్.	- 68 నుండి 39.2
ఎం.ఎం.ఆర్.	- 3.2

వాటర్ షెడ్ :

0 శాతం నుండి 80 శాతం

వ్యవసాయం :

వ్యవసాయ సాగు భూమి 40 శాతం నుండి 82 శాతం

స్ప్రింక్లర్ మరియు డ్రిప్ వ్యవసాయం 0 ఎకరాల నుంచి 8000 ఎకరాలకు పెంపు

పట్టు రైతులకు జాతీయస్థాయిలో గుర్తింపు.

ప్రతి 100 గ్రుడ్లకు 81 కేజీల పట్టు ఉత్పత్తి

ఎగుమతి పంటలు వేసి 13 కోట్లు (విదేశీ మారకద్రవ్యం) సముపార్జ

విద్యుత్ సర్వీసులు :

8 వేలు నుండి 22 వేలు విద్యుత్ కనెక్షన్లు

విద్యుత్ వినియోగం 68 లక్షల నుండి 1.63 కోట్లు యూనిట్లు

రక్షిత మంచినీటి సరఫరా :

20 శాతం నుండి 98 శాతం ప్రజలకు

పచ్చదనం :

38 శాతం నుండి 62 శాతం

రోడ్లు మరియు భవనాలు :

172 రోడ్లు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు కల్పన

ఇప్పుడు అన్ని గ్రామాల్లో రోడ్డు వసతి

140 కిలోమీటర్ల నుండి 562 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం

ఒక జాతీయ రహదారి

నీటి సంరక్షణ :

వర్షపాతం - సంరక్షణ 23 శాతం నుండి 62 శాతానికి పెంపు

ఊట చెరువులు 0 శాతం నుండి 78 శాతం చెరువులు

ఊట చెరువులుగా మార్చడంలో కుప్పం రైతులు దేశానికే ఆదర్శం

ఐ.టి.రంగం :

ఐ కమ్యూనిటీ ప్రాజెక్టు

విద్యావాహిని ప్రాజెక్టు

హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ప్రాజెక్టు

వరల్డ్ క్రాప్స్ - సి.ఐ.సి. సెంటర్ల ఏర్పాటు

భూసర్వే (జి.పి.ఎం.సర్వే)

సూక్ష్మ ప్రణాళిక

శ్రీ నారా చంద్రబాబునాయుడు

శ్రీ కోడెల శివప్రసాద్

శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి

శ్రీ పి.వి. సత్యనారాయణమూర్తి ఐ.ఎ.ఎస్.

జిల్లా కలెక్టర్, చిత్తూరు,

ఛైర్మన్, కాడా, కుప్పం

ఎ.శరత్, ఎం.బి.ఎ.

ప్రాజెక్టు అధికారి, కాడా

కుప్పం